Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 14.02.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 37 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

- లోక్‌సభలో యుద్ధవాతావరణం
- రౌడీలుగా మారిన కాంగ్రెస్, టీఆర్ఎస్ సభ్యులు
- దొంగచాటుగా లోక్‌సభలోకి విభజన బిల్లు
- వ్యతిరేకిస్తున్న బీజేపీ, నివ్వెరపోయిన ఇతర పార్టీలు
- గర్జించిన సీమాంధ్ర ఎంపీలు
- సీమాంధ్ర ఎంపీలపై దాడులు
- నిబంధనలు తుంగలో తొక్కిన కేంద్రం
- చరిత్రలోనే ఇదొక బ్లాక్‌డే



# సీమాంధ్రులు సింహాలై...

**డిసెంబర్ 9** పార్లమెంటుపై ఉగ్రవాదుల దాడి **ఫిబ్రవరి 13** పార్లమెంటు వ్యవస్థపై కాంగ్రెస్ దాడి



**ప్రజాస్వామ్యాన్ని పాతిపెట్టి, రాజ్యాంగాన్ని పక్కన పెట్టి, సొంత పార్టీ సభ్యుల గొంతు నొక్కి, ముష్టి పదంటే పది సీట్ల కోసం పట్టుబట్టి రాష్ట్ర విభజనకు మూర్ఖంగా నడుం కట్టి, సీమాంధ్రకు సమాధికట్టి పార్లమెంటులో టీ-బిల్లును ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నంతో భారత ప్రజాస్వామ్య వ్యవస్థ పరువుపోయింది. భారత పార్లమెంట్ వ్యవస్థ నవ్వులపాలైంది.**

భారత పార్లమెంట్‌కు సంబంధించి ఫిబ్రవరి 13, 2014 బ్లాక్‌డే! చరిత్రలో ఇంతకంటే దుర్దినం ఇంకోటి ఉండదేమో! ఇప్పటివరకు డిసెంబర్ 9 మాత్రమే పార్లమెంటు చరిత్రలో చీకటిరోజు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పార్లమెంటుపై దాడిచేసిన రోజది. కాని ఫిబ్రవరి 13 దానిని మరపిస్తుంది. ఎందుకంటే కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే పార్లమెంటుపై దాడి చేసింది. రాజ్యాంగ నిబంధనలను తుంగలోతొక్కి, ప్రజాస్వామ్య విలువలను గంగలో కలిపి సంకుచిత మనస్తత్వంతో తాము రూపొందించిన విభజన బిల్లును అడ్డదారిలో పార్లమెంటుకు తెచ్చి ప్రజాస్వామ్య వ్యవస్థనే భ్రష్టు పట్టించింది.

ఎవరు ఏమైనా కాని, ఎందరు ఎటైనా చావని, 5కోట్ల సీమాంధ్రులు ఒకటేసారి ఆత్మహత్య చేసుకోని... మాకు అవసరం లేదు, కనీసం వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత కూడా మా మీద లేదు, మాకు కావాల్సిందల్లా తెలంగాణలో సీట్లు... అందుకే తెలంగాణ బిల్లును తీసుకొస్తాం అని పంతం పట్టిన కాంగ్రెస్‌పార్టీ అనుకున్నట్లుగానే 13వ తేదీ గురువారం లోక్‌సభకు తెచ్చింది. ముందురోజు రైల్వేబడ్జెట్ సందర్భంగా సీమాంధ్ర (మిగతా 11వ పేజీలో)

# కాంగ్రెస్‌కో నమస్కారం

## రాజీనామా చేసిన ఆదాల, ముంగమూరు

**ఒకప్పుడు కాంగ్రెస్‌పార్టీలో టిక్కెట్ల కోసం నాయకులు పరుగెత్తే వాళ్లు. ఇప్పుడు కాంగ్రెస్ నుండి బయటకు పరుగులు తీస్తున్నారు. కాంగ్రెస్ పీడ మనకొద్దని వదిలించుకుంటున్నారు.**

రాష్ట్ర విభజనపై కాంగ్రెస్ అధిష్టాన నిర్ణయాన్ని నిరసిస్తూ సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు గురువారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసారు. 13వ తేదీ లోక్‌సభలో టీ-బిల్లు పెట్టగానే వీరిద్దరూ పార్టీకి రాజీనామా చేసారు. వీరు తర్వాత ఏ పార్టీలో చేరుతారనేది ఖరారు కాలేదు. ఇటీవల తెలుగుదేశంపార్టీలో చేరడానికి మంతనాలు సాగించినప్పటికి (మిగతా 11వ పేజీలో)



# పోలీస్ కింగ్.. నవదీప్ సింగ్



జిల్లాకు కొత్త ఎస్పీగా నవదీప్‌సింగ్ నియమితులయ్యారు. మల్కాజ్‌గిరి డిసిపిగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం నెల్లూరు ఎస్పీగా బదిలీ చేసింది. నవదీప్‌సింగ్ 2009 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. పంజాబ్‌కు చెందిన ఆయన ఆంధ్రా కేడర్‌కు ఎంపికయ్యారు. అనంతపురం ఏఎస్పీగా తొలిపోస్టింగ్. అక్కడ సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. ప్రసాదరావు డిజిపిగా వచ్చాక చేపట్టిన తొలి ఐపిఎస్ బదిలీలలో నవదీప్‌సింగ్ అనంతపురం నుండి మల్కాజ్‌గిరి డిసిపిగా వచ్చారు. కేవలం ఆయన అక్కడ మూడునెలలే పనిచేసారు. వెంటనే నెల్లూరు ఎస్పీగా బదిలీ చేసారు. నెల్లూరు ఎస్పీగా వున్న పి.వి.యస్.రామకృష్ణను (మిగతా 11వ పేజీలో)

## మూడోసారి రాజ్యసభకెళ్లిన

# అసాధ్యుడు సుబ్బరామిరెడ్డి



*ప్రేమకు సాగరం అంతటి మనిషి... మానవత్వంలో మేరు పర్వతం... వ్యక్తిత్వంలో ఎవరెస్ట్ శిఖరం... దానగుణంలో విశ్వమంతటి విశాలమైన మనస్తత్వం... విధేయతలో, వినయంలో శిఖరసమానం... ఇవన్నీ కలగలసిన మహోన్నత సేవారూపమే డాక్టర్ తిక్కవరపు సుబ్బరామిరెడ్డి.*

ప్రేమ, సేవ, దానం, దైవం, మంచి, మమత, అభిమానం, ఆదరణ, ఆప్యాయత, విధేయత, విశ్వాసం, విజయం... మరెన్నో సద్గుణాల కలయికే టి.సుబ్బరామిరెడ్డి. ఇన్ని సుగుణాల కలయిక కాబట్టే పదవులు సైతం ఆయన అడక్కుండానే వెదుక్కుంటూ వస్తున్నాయి.


ఈ నెల 7వ తేదీన జరిగిన రాజ్యసభ ఎన్నికలలో ఆయన వరుసగా మూడోసారి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. దీంతో విధేయత, విశ్వాసాన్ని కాంగ్రెస్‌పార్టీ గౌరవించినట్లయ్యింది.

టీఎస్సార్ తన ప్రస్థానంలో ఏ ముందడుగువేసినా మొదట ఆనందించేది నెల్లూరోళ్లే! ఎందుకంటే ఆయన కూడా తన ప్రస్థానంలో తొలిఅడుగులు వేసింది ఇక్కడనుండే! నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలో పుట్టిన సుబ్బరామిరెడ్డి ఈరోజు కాంగ్రెస్ అధిష్టానం మెప్పుపొంది వరుసగా మూడోసారి రాజ్యసభ సభ్యులుగా, అంతకుముందు రెండుసార్లు లోక్‌సభ సభ్యుడిగా ఎంపికయ్యాడంటే అది నెల్లూరీయులకు గర్వకారణమే.

పుట్టుకకు చావుకు మధ్య మనిషి చేయాల్సింది, చేయగలిగింది ఎంత అన్నది టీఎస్సార్ దైనందిన జీవితాన్ని చూస్తే తెలుస్తుంది. (మిగతా 11వ పేజీలో)

# అన్నమయ్యనీ వదల్లేదు!

నెల్లూరులో వాల్‌పోస్టర్లను విచ్చలవిడిగా అంటించేస్తున్నారు. వాల్‌పోస్టర్లు తెచ్చి అతికించడం కూడా సంస్కారహీనంగా, అర్థ రహితంగా ఇష్టానుసారంగా వుంటున్నాయి. నివాసగృహాలకే కాదు, పాఠశాలల, కళాశాలల, ప్రభుత్వ కార్యాలయాల, దేవాలయాల గోడలకు, అండర్ బ్రిడ్జిల వద్ద, ప్రారంభోత్సవ, శంకుస్థాపన శిలాఫలకాలకు... ఇలా ఎక్కడబడితే అక్కడ అంటించేస్తున్నారు. సినిమాలకు సంబంధించిన అశ్లీల వాల్‌పోస్టర్లు ముఖ్య కూడళ్ల వద్ద అంటిస్తుండడంతో వాహనాలలో వెళ్లేవాళ్లు వాటిని చూస్తూ చొంగకార్చుకుంటూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. వాల్‌పోస్టర్ల సంస్కృతి ఎంతగా పెరిగిపోయిందంటే, అందరూ భక్తిభావంతో చూసే ఆధ్యాత్మిక చింతనాపరులు, మహనీయుల విగ్రహాలను కూడా వదలడంలేదు. నెల్లూరు రాజీవ్‌మార్గ్‌లోని అన్నమయ్య విగ్రహం కూడా ఇప్పుడు వాల్‌పోస్టర్ల ఉచ్చులో చిక్కుకుంది. ఈమధ్య ఎవరంటేవాళ్లు ఈ ఐల్యాండ్ చుట్టూ వాల్‌పోస్టర్లను అంటించడం, బ్యానర్లు కట్టడం చేస్తున్నారు. ఎవరో అజ్ఞానులు ఈ పని చేసారంటే అర్థముంది. అందరికీ విజ్ఞానాన్ని పంచే జనవిజ్ఞానవేదిక వాళ్లు కూడా తమ పోస్టర్లను ఈ ఐల్యాండ్ చుట్టూ అంటించడం సబబుగాలేదని అన్నమయ్య భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవిజ్ఞానవేదిక నాయకులు ఈ పని చేయకపోయినా, ఈ వాల్ పోస్టర్లు అంటించే వాళ్లకు ఇంగితజ్ఞానం లేకుండాపోతుంది. నెల్లూరు నగరం మొత్తం మీద పోస్టర్లు అంటించే కార్మికులు ఓ పదిమంది వుంటారు, వీళ్లు ఎక్కువగా సినిమా థియేటర్లకు సంబంధించిన వాళ్లే వుంటారు. పోలీసులు ఆయా ప్రాంత స్టేషన్ల ద్వారా ఒకసారి వీరిని పిలిపించి ఒకే చోటచేర్చి కౌన్సిలింగిస్తే ఈ పరిస్థితిని అదుపు చేయవచ్చు. గతంలో అనేకసార్లు ఈ విషయమై డా॥ బెజవాడ గోపాలరెడ్డి మరియు అన్నమయ్య విగ్రహ కమిటీల పక్షాన అప్పటి ఎస్పీలకు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యమే అయ్యింది. అన్నమయ్య విగ్రహం ఏర్పాటుచేసి ఇప్పటికి 3సంవత్సరాలు గడుస్తున్నా, ఆ విగ్రహం జోలికెవ్వరూ వెళ్లే ధైర్యం చేయలేదు, ఇప్పుడు జనవిజ్ఞాన వేదిక పుణ్యమా అని ఇతరులకు దారిచూపినట్లవుతుంది.



# వినిపించని కూత



అనుకున్నదే జరిగింది. ఈ రైల్వేబడ్జెట్‌లోనూ నిరాశే మిగిలింది. రైల్వే మంత్రులు మారుతున్నా మన జిల్లాలో మాత్రం రైల్వేశాఖ పరంగా మార్పులుండడం లేదు. బుధవారం నాడు కేంద్ర రైల్వేశాఖ మంత్రి మల్లిఖార్జున ఖర్గే ప్రవేశపెట్టిన రైల్వేబడ్జెట్‌లో మన రాష్ట్రంతో పాటు మన జిల్లాకు కూడా మొండిచేయే మిగిలింది. జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా రూపాయి కేటాయించలేదు. ఏ ఒక్క పెండింగ్ లైన్ కూడా సెంటీమీటర్ ముందుకు కదల్లేదు. గత బడ్జెట్‌లలోనే మంజూరై నిధుల కోసం ఎదురుచూస్తున్న మూడు ప్రధాన రైల్వేలైన్‌లకు మంత్రి మొండిచేయి చూపారు. 2010-11లో 1314కోట్లతో నడికుడి- కాళహస్తి రైల్వేలైన్‌కు అంచనా వేసారు. సర్వేలు చేసారు. కాని నిధులు మాత్రం విడుదల చేయడం లేదు. ఈ రైల్వేలైన్ మంజూరు చేసాక మూడుబడ్జెట్‌లు వచ్చినా ఒక్క దానిలోనూ నిధుల ఊసులేదు. 2011-12 బడ్జెట్‌లో 278కోట్లతో గూడూరు - దుగరాజపట్నం రైల్వేలైన్ మంజూరు చేసారు. ఇప్పటికి మూడేళ్లవుతున్నా ఈ రైల్వేలైన్‌పై అతీగతీ లేదు. వెంకటాచలం - ఓబుళాపురం రైల్వేలైన్ పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఇక బిట్రగుంట లోకోషెడ్, కాంక్రీట్ స్లీపర్ కోచ్ ఫ్యాక్టరీ ఊసేలేదు. జిల్లాలో రైల్వేస్టేషన్‌ల ఆధునీకరణ, కొత్త రైళ్లు వంటి వాటి జోలికే పోలేదు. ఇదొక పనికిమాలిన బడ్జెట్‌గా చెప్పుకోవచ్చు.

# కలెక్టర్‌కు కోపమొచ్చింది



జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

తక్కువ మార్కులు వచ్చినవారి పేర్లను లిస్ట్‌లో ఎందుకు పెట్టాల్సి వచ్చిందంటూ కలెక్టరేట్ కార్యాలయంలోని ఏఓ, సూపరింటెండెంట్లపై నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేసారు. కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 10వతేది జిల్లాలో వికలాంగుల కోటా కింద ఉద్యోగాల భర్తీకి సంబంధించిన జాబితాను ఆయన పరిశీలించారు. జాబితాలో చోటు చేసుకున్న అక్రమాలను కలెక్టర్ పసిగట్టారు. దీంతో ఆయన పాలనా యంత్రాంగంలోని పని తీరును తప్పుపట్టారు. మీరు తప్పులు చేస్తే, నేను కోర్టు చుట్టూ తిరగాలా ఇదెక్కడి న్యాయం అంటూ నిలదీశారు. జాబితాను సరిదిద్ది మూడురోజుల్లోగా పబ్లిష్ చేయాలని ఆదేశించారు. దీనిపై ఏలాంటి ఫిర్యాదులు రాకుంటే సంతకం చేసి వారం రోజుల్లో వారికి అపాయింట్‌మెంటు ఆర్డర్ ఇస్తానన్నారు. ఫిర్యాదులు వస్తే సహించేది లేదని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.

# చేసారు పాపం... తగులుద్ది శాపం



సోనియాగాంధీకి విభజన పాపం ఊరికే పోదని, ఆ కుటుంబానికి ఆరు కోట్ల మంది ప్రజల ఉసురు తగులుతుందని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 12వ తేదీన నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీమాంధ్రుల గొంతు కోసేందుకు సిద్ధమైన సోనియా కుటుంబానికి వినాశనం తప్పదని శాపనార్థాలు పెట్టారు. సీమాంధ్రుల కోసం బీజేపీ కొన్ని సవరణలను ప్రతిపాదించినా వాటిని పరిగణలోనికి తీసుకోకపోవడం శోచనీయమన్నారు. దేశానికి పెద్దదిక్కులా వుంటూ రాజ్యాంగ నిబంధనలను కాపాడాల్సిన రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ కూడా తెలంగాణ విషయంలో కాంగ్రెస్ అధిష్టానానికి రబ్బర్ స్టాంప్‌లా వ్యవహరించారని ఆయన దుయ్యబట్టారు. మూజువాణి ఓటుతో తెలంగాణ బిల్లును ఆమోదింపజేయాలని చూస్తున్నారని, ఈ పోకడలు ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. తెలంగాణపై వేసిన జిఓఎం కూడా దొంగల ముఠా మాదిరిగా ఉందన్నారు. హైదరాబాద్‌ను తెలంగాణకు ఇవ్వడం వల్ల 15వేల కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుందని, సీమాంధ్రలో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా ఉండదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.

## ఏజేసీగా రాజ్‌కుమార్

నెల్లూరు జిల్లా అడిషనల్ జాయింట్ కలెక్టర్‌గా శ్రీకాకుళం జిల్లా అడిషనల్ జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న సిహెచ్ పెంచలరెడ్డిని ఏపీ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు బదిలీ చేసారు.

## డిఆర్‌ఓగా హేమసాగర్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న బదిలీలలో భాగంగా నెల్లూరు జిల్లా డిఆర్‌ఓగా అనంతపురం డిఆర్‌ఓగా పనిచేస్తున్న పి.హేమసాగర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 1985లో అనంతపురంలో ప్రొబేషనరీ ఉప తహశీల్దారుగా ఉద్యోగంలోకి ప్రవేశించిన ఆయన తహశీల్దారుగా, ప్రత్యేక సబ్‌కలెక్టర్‌గా పలుచోట్ల పని చేసారు. 2009-13వరకు కడప డీఆర్‌ఓగాను, నిన్నటి వరకు అనంతపురం డీఆర్వోగా పనిచేస్తూ నెల్లూరుకు బదిలీఅయ్యారు.

## డిప్యూటీ కమీషనర్ భాగ్యలక్ష్మి బదిలీ

నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ భాగ్యలక్ష్మిని అనంతపురం జిల్లా గుంతకల్లు మునిసిపల్ కమీషనర్‌గా బదిలీ చేస్తూ ఈ నెల 11న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆరేళ్ళక్రితం సత్తెనపల్లి మునిసిపాలిటీ నుంచి పదోన్నతిపై నెల్లూరు నగర పాలక సంస్థకు డిప్యూటీ కమీషనర్‌గా ఆమె నియమితులయ్యారు. ఇటీవల నెల్లూరు జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటిలో ఇన్‌చార్జి కమీషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

# మైథిలి 23వ వార్షిక ఆటల పోటీలు




నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 11న వేదాయపాళెం చంద్రమౌళినగర్‌లోని మైథిలి ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులకు 23వ వార్షిక ఆటల పోటీలు జరిగాయి. పోటీలను ప్రారంభించిన ముఖ్యఅతిథి నెల్లూరు మండల విద్యాశాఖాధికారి సిహెచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఆటల వలన మనసుకు ప్రశాంతత కలిగి చురుకైన, ఆరోగ్యకరమైన ఆలోచనా విధానం అలవడుతుందని శరీర సౌష్టవం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ప్రతి ఏటా ఆటల పోటీలు నిర్వహిస్తున్న మైథిలి స్కూలు యాజమాన్యాన్ని అభినందిస్తున్నానన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు బి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ చదువుల ఒత్తిడితో పిల్లలు ఆందోళన పడకుండా మానసికానందం పొందాలంటే ఆటలు చాలా అవసరమని అందుకే ప్రతి సంవత్సరం స్కూలులో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ మైథిలి మనోహర్‌రెడ్డి, డైరెక్టర్స్ రాధాకృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# ఇది సోనియా తోలుబొమ్మలాట

- వైఎస్సార్సీపీ నేత డా॥ పి.అనిల్ యాదవ్



ప్రజాదీవెన యాత్రలో భాగంగా ఈనెల 12న వైఎస్ఆర్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త డా॥పి.అనిల్‌కుమార్ యాదవ్ నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట ప్రధాన రహదారిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హైకమాండ్ పూటకోరీతిలో డ్రామాలాడుతుందని తెలిపారు. తెలంగాణ బిల్లును వ్యతిరేకిస్తున్నందున ఆరుగురు ఎంపీలను బహిష్కరించిన వారు అసెంబ్లీలో అదే బిల్లును వ్యతిరేకించిన ఎమ్మెల్యేలను, ఢిల్లీలో ధర్నా చేసిన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ ఛీఫ్ బొత్స సత్యనారాయణలను ఎందుకు బహిష్కరించలేదని ప్రశ్నించారు. బహిష్కరణకు గురైన ఆరుగురు ఎంపీలు కూడా సోనియాగాంధీ ఆడిస్తున్న తోలుబొమ్మలాటలో భాగంగానే ఇన్నాళ్ళు అవిశ్వాసం, ధర్నాలు అంటూ రకరకాల తైతక్కలు ఆడారని విమర్శించారు. కార్యక్రమంలో సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ముక్కాల ద్వారకానాథ్, ముప్పసాని శ్రీనివాసులు, మంచికంటి శ్రీనివాసులు, దాసా లక్ష్మీనారాయణ, రాచపూటి కుమార్, సరాబు సుబ్రహ్మణ్యం, శ్రీరాం సురేష్, సొల్లేటి వెలుగొండయ్య, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

● దుగరాజపట్నం



# కదులుతున్న ఓడరేవు

**▸ భూసేకరణకు శ్రీకారం ▸ అపోహలు తొలగిపోయినట్లే**

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన అతిపెద్ద ఓడరేవును ఎన్నో అవాంతరాల మధ్య నెల్లూరుజిల్లా దుగరాజపట్నం వద్ద మంజూరు చేయడం జరిగింది. జిల్లాలో నక్కలపల్లి, రామాయపట్నం, దుగరాజపట్నం... అనే మూడు ప్రాంతాలను పరిశీలించి వాటిలో మొదట దుగరాజపట్నంను ఎంపిక చేసారు. తర్వాత షార్, పర్యాటకశాఖల అభ్యంతరాలతో రామాయపట్నంను ఎంపిక చేసారు. అయితే తిరుపతి ఎంపీ చింతామోహన్ పైరవీలు సాగించి పాకులాడి మళ్ళీ దుగరాజపట్నంకే ఈ పోర్టును తీసుకు రాగలిగారు. షార్ అభ్యంతరాలను నివృత్తి చేయడంతో పాటూ పర్యావరణ, పర్యాటకశాఖ అనుమతులు కూడా లభించడంతో దుగరాజపట్నంపోర్టుకు లైన్ క్లియరైంది. అయితే పోర్టును దుగరాజపట్నం వద్ద కాకుండా ఆ పక్కనే వున్న తూపిలిపాలెం వద్ద నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

దాదాపు 8వేల కోట్ల రూపాయలతో కేంద్రమే ఈ పోర్టును నిర్మించబోతోంది. ఇక పోర్టుకు అనుసంధానంగా వేలకోట్లతో పెట్టుబడులు రానున్నాయి. పోర్టు నిర్మాణంలో ముందడుగుగా ప్రభుత్వం భూసేకరణకు శ్రీకారం చుట్టింది. ఇక్కడే ఓడరేవు అని కేంద్రం గెజిట్ కూడా విడుదల చేయడంతో ఇక మార్పుకు అవకాశం లేదని తేలిపోయింది. దీంతో అధికారులు భూసేకరణపై దృష్టిపెట్టారు. ఈ పోర్టుకు భూసేకరణ, దాని వివరాలు పంపాలని కేంద్రం కోరడంతో అధికారులు ఆఘమేఘాల మీద వివరాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ఓడరేవుకు 5028ఎకరాల భూమిని సేకరించనున్నారు. వీటిలో పట్టాభూములు 1218ఎకరాలు, ప్రభుత్వ భూములు 2152 ఎకరాలు, అటవీ భూములు 949ఎకరాలు, సిజెఎఫ్ఎస్, డికెటి భూములు 651ఎకరాలు, గ్రామాలకు చెందిన నివేశస్థలాలు 57ఎకరాలు ఉన్నాయి. భూసేకరణకు 111.97కోట్లు, పునరావాసానికి 14.35కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసారు.

భూసేకరణ ప్రక్రియ మొదలు కావడంతో పోర్టు నిర్మాణానికి ప్రతికూలాంశాలు తొలగిపోయినట్లేనని భావిస్తున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా సీమాంధ్రకు చేకూర్చే ప్రయోజనాలలో కేంద్రం దుగరాజపట్నం ఓడరేవును కూడా చేర్చింది. కాబట్టి ఇది ఖాయమే అనుకోవచ్చు.

# తెరపైకి సెకండ్ కేడర్









***జిల్లాలో హస్తం పార్టీకి అభ్యర్థులు కరువవుతున్నారు. తండ్రి తాగు బోతయినా కొడుకులు వదులుకో లేరుగా! కాంగ్రెస్‌తో ఆనం సోదరుల బంధుత్వం అలాంటిదే!***

రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పనికి మాలిన పని చేసిందని ఆ పార్టీ నాయకు లంతా తలా నాలుగు తిట్టి పార్టీని వది లేసి పోతున్నారు. అయితే అందరితో పాటు ఆనం సోదరులు వదిలేసి పోలేక పోతున్నారు. ఈరోజు కాంగ్రెస్ వెధవపని చేసి వుండొచ్చు. అయితే గతంలో తమకు చేసిన మంచిని మరవకూడదనేది వారి ఉద్దేశ్యం. అందుకే కాంగ్రెస్‌పార్టీ నాశన మవుతుందని తెలిసినా ఆ పార్టీనే అంటి పెట్టుకుని ఉంటున్నారు. నెల్లూరు లోక్‌సభతో పాటు జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను వెదికి పెట్టాల్సిన బాధ్యత వారి మీదే పడింది.

2009 ఎన్నికల వరకు కూడా కాంగ్రెస్ టిక్కెట్ల కోసం నాయకులు 'క్యూ'లో నిల్చునే పరిస్థితి ఉండేది. కాని ఇప్పుడు పార్టీ తరపున పోటీ చేయ మని నాయకులను బ్రతిమలాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆనం వాళ్ల ఇంట్లోనే నలుగురు పోటీకి దిగాల్సి వచ్చేటట్లుంది. పార్లమెంటుకు వాళ్లే పోటీ చేయాలి. నెల్లూరునగరం, రూరల్, ఆత్మకూరు అసెంబ్లీ స్థానాల నుండి కూడా వాళ్లే పోటీ చేయాల్సి ఉంటుంది. వెంకటగిరి నుండి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, గూడూరు నుండి పనబాక కృష్ణయ్య ఉన్నారు. సూళ్లూరుపేట నుండి ఎవరో ఒకరు ద్వితీయశ్రేణి నాయకుడినే నిలబెట్టాల్సి వుంటుంది. సర్వేపల్లి నుండి చూస్తే సి.వి.శేషారెడ్డి, సిహెచ్.హరిబాబు యాదవ్, ఈదూరు రామ్మోహన్‌రెడ్డిలలో ఒకరిని నిలపాలనే ప్రతిపాదన వుంది. కోవూరు మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈసారి కాంగ్రెస్‌లో ఉండడం అనుమానమే. ఇక డీసీఎంఎస్ ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి ఉన్నాడు. సీఎం కిరణ్ కాంగ్రెస్ నుండి వైదొలిగితే సుమంత్ కూడా ఆయనతో నడిచే అవ కాశాలున్నాయి. ఇక ఎవరో ఒకరు అనామకుడిని ఇక్కడ నిలబెట్టక తప్పదు.

కావలిలో చూస్తే ప్రధాన నాయకు లెవరూ లేరు. ద్వితీయశ్రేణి నాయకులే

(మిగతా 5వ పేజీలో)





# ఇందిరాభవన్‌ను... మరచిపోతున్నారు

కొన్నేళ్ల క్రితం జిల్లాలో ప్రధానపార్టీ కార్యాలయం ఏదన్నా ఉందంటే అది ఇందిరాభవనే! విజయమహల్‌గేటు వద్ద ఉన్న ఇందిరాభవన్ పేరుతో ఆ వీధే ఏర్పడింది. ఇక్కడ కాంగ్రెస్‌పార్టీకి సొంత కార్యాలయం ఏర్పడిందంటే అది నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కృషి ఫలితమే. ఇక్కడ ప్రైవేట్ ఫంక్షన్‌లకు అద్దెకు ఇస్తున్నా పార్టీ కార్యక్రమాలు కూడా బాగానే జరిగేవి. ముఖ్యంగా సి.వి.శేషారెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పుడైతే ఇక్కడ వారానికొకసారన్నా ఏదో ఒక కార్యక్రమం పెడుతుండేవాడు.

అయితే కొన్నాళ్లుగా ఇక్కడ పార్టీ కార్యక్రమాలు మందగించాయి. జిల్లా స్థాయి పార్టీ కార్యక్రమాలు అసలు లేవు. నగరం స్థాయి కార్యక్రమాలు ఏ.సి సెంటర్‌లో జరుగుతున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ విభజన నిర్ణయం తీసుకున్నాక ఇందిరాభవన్ ముందు పోలీసులు తప్పితే కార్యకర్తలు కనిపించడం లేదు.



విజయాశీస్సులు

నెల్లూరుజిల్లా కీర్తి కిరీటం
సేవారంగంలో ఉవ్వెత్తున ఎగసిన కెరటం
రెండుసార్లు లోక్‌సభ సభ్యునిగా
మూడుసార్లు రాజ్యసభ సభ్యుడిగా
తెలుగుజాతి మంగళహారతులు అందుకుంటున్న
**మేరుమగధీరుడు**
మా **సుబ్బరామ్**కు
శుభాభినందనలు... విజయాశీస్సులు.

జె.వి.రెడ్డి
జె.జానకమ్మ




## ఇమేజ్ కాదది డ్యామేజ్

కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ(రాగా)ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించే ప్రక్రియలో భాగంగా ఆయన ఇమేజ్‌ను పెంచేందుకు టెన్ జనపథ్ చక్కభజన బృందం చేస్తోంది కసరత్తు. చేస్తోంది ఎంతో తతంగం. ఆ తతంగమంతా నిరుపయోగమని చేస్తోంది 'సోగా' అంతరంగం. 'రాగా', 'నమో' ధాటికి తట్టుకోలేడని చెప్తోంది. ఆయన్ని వర్కింగ్ కమిటీ అధ్యక్షుడుగా చేయాలని నిశ్చయించినట్లు తెలుస్తోంది. దేశ భవిష్యత్తును రాజకీయ అర్భకుడైన 'రాగా' చేతిలో పెట్టడం క్షేమకరం కాదు. ఇప్పటికైనా భజన బృందం 'రాగా' ఇమేజ్‌ను పెంచే ప్రయత్నం మానుకొని కేంద్రంలోను స్థిర ప్రభుత్వం ఏర్పడేందుకు కృషి చేయాలి.

*కురుగూరు రంగనాథం,*
*నెల్లూరు.*

## బీజేపీదే భారం

తెలంగాణవాళ్లు ప్రత్యేక రాష్ట్రం కావాలంటే ఇచ్చేయండి. కాని అందుకు సీమాంధ్రులను బలి చేయడం భావ్యం కాదు. సీమాంధ్రుల మీద కాంగ్రెస్ కక్ష కట్టి నట్లుగా వ్యవహరిస్తుంది. బీజేపీ దానికి వంతపాడకూడదు. సీమాంధ్రకు న్యాయం జరిగేలా ఉంటేనే విభజన బిల్లుకు మద్దతివ్వండి. లేదంటే అడ్డుకోండి. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్రాన్ని న్యాయబద్ధంగా విభజించవచ్చు.

*వి.ఎస్.శంకర్ నారాయణ,*
*నెల్లూరు.*

## కాంగ్రెస్ పోవాలి

దేశ రాజకీయాల నుండి కాంగ్రెస్ పూర్తిగా కనుమరుగైపోవాలి. దేశంలో నేటి పరిస్థితులకు ఆ పార్టీయే కారణం. ప్రజలను సంఘటితం చేయకుండా, కులాలు, మతాల పేరుతో విభజిస్తుంది. ప్రజలను ఓట్ల బ్యాంకు మాదిరిగా చూస్తుంది. అధికారం నిలుపుకోవడం కోసం తాత్కాలిక పథకాలు చేపడుతూ శాశ్వత అభివృద్ధిని దేశానికి దూరం చేస్తుంది. మనతో పాటే స్వతంత్ర్యం వచ్చి ఎన్నో దేశాలు మనకంటే ముందున్నా, మనమిలా ఉండడానికి కారణం కాంగ్రెస్సే!

*జి.నాగరాజు, అల్లూరు.*

# 'ప్రభా'తం

కేంద్రంలోని యూపిఏ సర్కార్ పాలన మహాభారతంలోని ధృతరాష్ట్రుని గుడ్డి దర్బార్‌ను తలపిస్తోంది. రామాయణంలో వనవాసాన్ని మరిపిస్తుంది. కైకేయి కోరింది కాబట్టి శ్రీరాముడిని వనవాసానికి పంపాడు దశరథ మహారాజు. పాండవులు ఐదూర్లు అడిగితే అది కూడా ఇవ్వకుండా కురుక్షేత్ర సంగ్రామానికి కారణమయ్యాడు ధుర్యోధనుడు. ఇప్పుడు సీమాంధ్రుల బాగోగులను పట్టించుకోకుండా, వారు కోరిన సవరణలు చేయకుండా విభజన బిల్లును పార్లమెంటులో పెట్టడం ద్వారా ధృతరాష్ట్ర పాలననే మంచిది అనిపిస్తుంది యూపిఏ సర్కార్.

కాంగ్రెస్‌పార్టీది ఎంత అరాచకపు విధానమో, ఎంతటి పైశాచికత్వపు సిద్ధాంతమో రాష్ట్ర విభజన బిల్లు తీరుతెన్నులు చూస్తే అర్థమవుతుంది. రాజకీయ రాక్షసక్రీడగా విభజన బిల్లును మార్చింది. ఒక పద్ధతి లేదు, ఒక న్యాయం లేదు, ఒక ప్రాతిపదిక లేదు. రాజకీయ ప్రయోజనమే ఆ పార్టీ ప్రధానాంశం. తెలంగాణలో పార్లమెంటు సీట్లన్నీ కావాలి అనే లక్ష్యంతో టి-బిల్లును రూపొందించింది. సిడబ్ల్యూసిలో తెలంగాణపై నిర్ణయం తీసుకుంది మొదలు ఈ విషయంలో ఆ పార్టీ మొత్తం అరాచకపు ధోరణులను, నియంతృత్వ విధానాలనే అనుసరిస్తుంది. మా చేతుల్లో అధికారం ఉంది... కాబట్టి మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం అన్నట్లుగా వ్యవహరిస్తుంది.

కేంద్రం రూపొందించిన టీ-బిల్లు చూస్తే ఒకటో తరగతి చదివే కుర్రాడు కూడా మరీ ఇంత అన్యాయమా... సీమాంధ్రకు ఇంత ద్రోహమా? అని ప్రశ్నిస్తాడు. మన రాష్ట్రంలో వారిని కాదు, పక్క రాష్ట్రాలలో వారికి చూపించినా ఇది అన్యాయపు బిల్లేనంటారు. మరి ఇంతటి దుర్మార్గమైన బిల్లును కేంద్రప్రభుత్వం రూపొందించడం, కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేయడం, రాష్ట్రపతి ఆమోదించడం, పార్లమెంటులో ప్రవేశపెట్టడం.. ఇవన్నీ చూస్తుంటే అన్యాయాన్ని ఇక అడ్డుకునేదెవరనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను తోలుబొమ్మ అనాలో, మరబొమ్మ అనాలో తెలియడం లేదు. ఒకప్పుడు దేశ ప్రజలకు ఆయన మీద ఎంతో గౌరవం ఉండేది. ఈ మధ్యకాలంలో పూర్తిగా పోయింది. ఒక ప్రాంతానికి అవసరానికి మించి మేలు చేస్తూ మరో ప్రాంతానికి అత్యంత నష్టం కలుగజేస్తున్న ఇలాంటి బిల్లును రూపొందించారంటే ఇందులో ప్రధానికి భాగస్వామ్యం లేకుండా పోలేదు. ఇప్పటికే చచ్చుపాలన ద్వారా టన్నులకొద్దీ అపకీర్తిని మూటగట్టుకున్న ఆయన ఈ పక్షపాతపూరిత బిల్లు ద్వారా మరింత అప్రదిష్టపాలయ్యారు.

టీ-ప్రక్రియ మొదలైంది మొదలు కాంగ్రెస్ నేతల మాటలు, చేష్టలన్నీ కూడా అరాచకంగానే వున్నాయి. రెండు నెలల పాటు సీమాంధ్రలో ఆందోళనలు జరిగినా ఏ మాత్రం పట్టించుకోలేదు. మీ చావు మీరు చావండన్నట్లుగా వదిలేసారు. సీమాంధ్రలో ఆందోళనలను శాంతింపజేసే విధంగా కూడా కాంగ్రెస్ నేతలు వ్యవహరించలేదు. దిగ్విజయ్‌సింగ్, షిండేలు సూటిపోటి మాటలతో విభజన అగ్నికి ఆజ్యం పోస్తూ వచ్చారు. రాష్ట్ర శాసనసభ అంటే లెక్కలేనితనంగా వ్యవహరించారు. దిగ్విజయ్‌సింగ్ కాంగ్రెస్ నాయకుడిలా కాదు రాజ్యాంగాధిపతిలా వ్యవహరించాడు. రాజ్యాంగేతరశక్తి రాజ్యమేలుతున్న తరుణంలో దిగ్విజయ్ అదే మార్గంలో పయనిస్తున్నాడనుకుందాం, ఈ హడావిడి విభజనలో ప్రజాస్వామ్య ఛాయలు కనిపించడం లేదు. నియంతృత్వమే కనిపిస్తుంది. కేంద్రం పంపిన విభజన బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించి పంపింది. రాష్ట్ర శాసనసభ తీర్మానం లేకుండా ఇంతవరకు ఏ రాష్ట్రం ఏర్పడలేదు. కాని రాష్ట్ర శాసనసభ తిరస్కృతిని కేంద్రం లెక్కచేయలేదు. మీ అభిప్రాయాలు చెప్పమన్నాం గాని, బిల్లును ఓడించమనో గెలిపించమనో కాదు అని దిగ్విజయ్‌సింగ్ మొదటి నుండి అహంకారపూరితంగా మాట్లాడుతున్నాడు. శాసనసభ తిరస్కృతిని కూడా ఆయన అదే విధంగా అపహాస్యం చేసాడు. విభజన బిల్లును హైదరాబాద్ నుండి ఢిల్లీకి పంపక ముందే, రాష్ట్రపతి ఆమోదం రాక మునుపే ఫలానా తేదీన రాజ్యసభలో పెడతాం, ఫలానా తేదీన లోక్‌సభలో పెడతాం అంటూ కేంద్ర హోంమంత్రి ప్రకటించేసారు. అంటే రాష్ట్రపతి ఏం చేయాలో కూడా వీళ్లే నిర్దేశిస్తున్నారన్నమాట. కనీసం ఎందుకు రాష్ట్రాన్ని విడదీస్తున్నారో కూడా చెప్పలేని దిక్కుమాలిన స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం టీ-బిల్లును రూపొందించింది.

ఇలాంటి బిల్లు ఈరోజు పార్లమెంటు గుమ్మం వద్దకు వచ్చింది. కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం ఉంటేనే సమాఖ్య వ్యవస్థ పటిష్టమవుతుంది. కాని ఇక్కడ రాష్ట్రాల హక్కులను కాలరాచే విధంగా కేంద్రం వ్యవహరిస్తుంది. 5కోట్ల మంది ప్రజల గొంతులను నొక్కుతుంది. ఇలాంటి ఏకపక్ష బిల్లు ఆమోదం పొందితే రేపు కేంద్రంలో ఇంకే పార్టీ ప్రభుత్వం వచ్చినా ఇదే పోకడలను అవలంబిస్తుంది. ఈ దిక్కు, దివాణం లేని విభజన బిల్లును అడ్డుకుని కాంగ్రెస్‌కు గుణపాఠం చెబితేనే భవిష్యత్ ఇలాంటి నియంతృత్వ ధోరణులను అరికట్టడానికి వీలవుతుంది.



### అరాచక ప్రక్రియ

టీ-ప్రక్రియ మొదలైంది మొదలు కాంగ్రెస్ నేతల మాటలు, చేష్టలన్నీ కూడా అరాచకంగానేవున్నాయి. రెండునెలల పాటు సీమాంధ్రలో ఆందోళనలు జరిగినా ఏ మాత్రం పట్టించుకోలేదు. మీ చావు మీరు చావండన్నట్లుగా వదిలేసారు. సీమాంధ్రలో ఆందోళనలను శాంతింపజేసేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరించలేదు.

## 'అంతర్'జాతీయం

- జనలోక్‌పాల్ బిల్లును నిలువరించేందుకు కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపాయని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండానే ఢిల్లీ ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలలో ప్రతిపాదిత చట్టాన్ని తమ ప్రభుత్వం ఆమోదిస్తుందని ఆ పార్టీ పేర్కొంది.
- పాకిస్థాన్ బాలిక హక్కుల పోరాట యోధురాలు యూసుఫ్ మలాలాజాయ్‌ను ప్రతిష్టాత్మక బాలల నోబెల్ పురస్కారం–2014 వరించింది. స్వీడన్‌కు చెందిన సంస్థ ఏటా ముగ్గురికి అవార్డులు అందజేస్తుంది. మలాలాతో పాటు అమెరికాకు చెందిన జాన్‌ఉడ్, నేపాల్‌కు చెందిన ఇందిరా రానామగర్‌లు ఈ అవార్డులు అందుకోనున్నారు.
- 55ఏళ్ల క్రితం మొదలైన తన రాజకీయ ప్రయాణం ఇంకా ముగిసిపోలేదని బీజేపీ అగ్రనేత అద్వానీ పేర్కొన్నారు. ఆరెస్సెస్‌తో తన బంధాన్ని నెమరు వేసుకుంటూ అది తన జీవితానికి అర్థాన్నిచ్చిందన్నారు.
- నేపాలీ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు సుశీల్‌కోయిరాలా(75) నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన రాజ్యాంగసభ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. దీంతో నేపాలీకాంగ్రెస్, సీపీఎన్–యూఎంఎల్‌ల మధ్య ఆరు అంశాల ఒప్పందం కుదిరింది.
- బీసీసీఐ అధ్యక్షుడు శ్రీనివాసన్ అల్లుడు గురునాధన్ మయప్పన్‌పై వచ్చిన బెట్టింగ్ ఆరోపణలు నిజమేనని ఐపిఓల్ కుంభకోణంపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ తేల్చిచెప్పింది. ఆయన బెట్టింగ్‌లకు పాల్పడడం, జట్టు సమాచారాన్ని బుకీలకు అందించడం నిజమేనని మాజీచీఫ్ జస్టిస్ ముకుల్ ముద్గుల్ నేతృత్వంలోని త్రిసభ్య సంఘం తన నివేదికలో పేర్కొంది.
- ఆస్ట్రేలియా నుండి తాత్కాలిక వర్క్ వీసాలు పొందుతున్న వారిలో భారతీయుల సంఖ్యే అధికమని ఆస్ట్రేలియా ఇమ్మిగ్రేషన్ అధికారులు తాజాగా విడుదలచేసిన సమాచారంలో వెల్లడైంది.
- దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న 9మంది సైనికులను గడచిన మూడేళ్లలో అరెస్ట్ చేసినట్లు రక్షణశాఖ మంత్రి ఏ.కె.ఆంటోని వెల్లడించారు.
- అల్జీరియాలో 11వ తేదీ ఘోరవిమానప్రమాదం సంభవించింది. సైనిక విమానం విమానం కొండను ఢీకొని పేలిపోయిన దుర్ఘటనలో 103మంది మరణించారు. వీరిలో 99మంది సైనికులున్నారు.
- దేశంలో పోలియో నిర్మూలనకు కృషి చేసినందుకుగాను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి రోటరీక్లబ్ అత్యున్నత పురస్కారం 'అవార్డ్ ఆఫ్ ఆనర్' లభించింది. అంతర్జాతీయ రోటరీక్లబ్ అధ్యక్షుడు రాన్‌బర్డన్ మంగళవారం రాష్ట్రపతికి ఈ అవార్డును అందజేసారు.

## వార్త వ్యాఖ్య

వార్త :– దారితప్పిన షిర్డి రైలు. – అవస్థలు పడిన ప్రయాణీకులు.
**వ్యాఖ్య :– *ప్రభుత్వాలే దారితప్పాయి. రైళ్లొక లెక్కా?***

వార్త :– తృతీయ ఫ్రంట్ ఏర్పాటు చేస్తాం. – జేడీయూ అధ్యక్షుడు శరద్‌యాదవ్.
**వ్యాఖ్య :– *ఫ్రంట్ అంటే ఒక రకంగా టెంటే కదా?***

వార్త :– పార్లమెంటులో ఇక చెడుగుడే. – లగడపాటి.
**వ్యాఖ్య :– *బాగా ప్రాక్టీస్ చేయండి.***

వార్త :– వేసవికి ముందే విద్యుత్ కోతలు.
**వ్యాఖ్య :– *అప్పటికి అలవాటు పడిపోతారని.***

వార్త :– దండగమారి మన్మోహన్. – గౌహతి సభలో మోడీ వ్యాఖ్య.
**వ్యాఖ్య :– *దేశానికి దండగైనా తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడుగా!***

వార్త :– కణతకు తుపాకీ ఎక్కుపెట్టారు. – విభజనబిల్లుపై వెంకయ్యనాయుడు.
**వ్యాఖ్య :– *మీది రామరాజ్యమైతే కాంగ్రెస్‌ది రౌడీరాజ్యం?***

వార్త :– విభజన నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం. – కేంద్రమంత్రి కావూరి.
**వ్యాఖ్య :– *ఆ సంగతి తెలిసి కూడా పదవిలో ఉండడానికి సిగ్గు లేదా?***

వార్త :– పార్లమెంటులో ప్రాణత్యాగానికైనా సిద్ధమే. – సబ్బం హరి.
**వ్యాఖ్య :– *అంత దూరమెుద్దుగాని, బిల్లును అడ్డుకోండి చాలు.***

వార్త :– మేము జీవితమంతా సోనియాకు ఋణపడి ఉండాలి. – మంత్రి డొక్క.
**వ్యాఖ్య :– *ప్రజలకు కాదు...***

వార్త :– బాధ్యతల నుండి తప్పుకోవడమే అవుతుంది. – రాజీనామాలపై బొత్స.
**వ్యాఖ్య :– *కాంగ్రెస్‌కు సమాధికట్టే బాధ్యతల నుండా...!***

వార్త :– దేశ చరిత్రలో ఇది విధ్వంసకర దశాబ్దం. – నరేంద్ర మోడీ.
**వ్యాఖ్య :– *దీనిని మన్మోహన్‌దశాబ్దమంటే సరి...!***

వార్త :– సీమాంధ్రకు సోనియా న్యాయం చేస్తారు. – డి.యస్.
**వ్యాఖ్య :– *ఆమె దయాదాక్షిణ్యాలతో బతికేకంటే చావడం నయం.***

వార్త :– ఓట్లు రాలే అంశాలకే బడ్జెట్‌లో ప్రాధాన్యం. – జేపీ.
**వ్యాఖ్య :– *మరి ఎన్నికలు దగ్గరకొచ్చాయిగా..!***

వార్త :– కాంగ్రెస్‌లో వున్నందుకు సిగ్గు పడుతున్నా. – మంత్రి ఏరాసు.
**వ్యాఖ్య :– *ఇంత ఆలస్యంగా సిగ్గుపడుతున్నారా?***

# విఎస్‌యు పరిధిలో వర్క్‌షాపులు



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న విసీ రాజారామిరెడ్డి

విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అన్ని విభాగాల్లో సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించడంతో అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని వియస్‌యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.రాజారామిరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని క్యాంపస్ కళాశాల సెమినార్ హాల్లో ఈ నెల 8న కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. ముంబయిలోని బార్క్ అనలైటికల్ కెమిస్ట్రీ హెచ్‌ఓడీ డాక్టర్ ఎపి రమణారెడ్డి జ్యోతి ప్రకాశనంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విసీ రాజారామిరెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన విఎస్‌యూలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో రెండు అంతర్జాతీయ సదస్సులు, రెండు వర్క్‌షాపులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి వర్క్‌షాపుల ద్వారా ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలను పంచుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. మార్చిలో నిర్వహించనున్న వర్శిటీ ప్రథమ స్నాతకోత్సవం సందర్భంగా కెమిస్ట్రీ విభాగంలో ప్రథమ ర్యాంకు సాధించిన పిజీ విద్యార్థికి గోల్డ్ మెడల్ ఇస్తానని అమెరికాకు చెందిన డాక్టర్ శేషమ్మ ప్రకటించి ఉన్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసులురెడ్డి, ఏజీ దాసు, డాక్టర్ టీవీ రమణారెడ్డి, డాక్టర్ షణ్ముగం, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# రోటరీ ఉచిత నేత్ర వైద్య శిబిరం

రొటేరియన్ స్వర్గీయ డి.ఎస్.రెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి కుటుంబం సౌజన్యంతో ఈనెల 9న నెల్లూరు మండలం పాతవెల్లంటిలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ ఐ ఫౌండేషన్ జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త నిర్వహణలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసారు. వెల్లంటి, సజ్జాపురం, గొల్లకందుకూరు, కందమూరు, సౌత్‌మోపూరు గ్రామాలలోని 280 మందికి ఉచితంగా కంటి వైద్యనిపుణులు డాక్టర్ యం.శార్వాణి, డాక్టర్ ఆర్.వి.సుబ్రహ్మణ్యంలు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. 28మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసారు. 30మంది రోగులకు నెల్లూరులోని రోటరీ నేత్ర వైద్యశాలలో శస్త్ర చికిత్సలు చేయుటకు ఎంపిక చేసారు. డాక్టర్ దొరస్వామినాయుడు సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో రోటరీ ఐ ఫౌండేషన్ ఛైర్మెన్ పి.శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి రాఘవేంద్రషెట్టి, కోశాధికారి వి.శ్రీనివాసులు, మాజీ గవర్నరు దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, రోటరీ అధ్యక్షులు టి.శేఖర్, నారాయణ, లక్ష్మీనారాయణ, కె.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో మైసూరు దత్త పీఠాధిపతి

నెల్లూరు నగరం దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణ యోగా మందిరంలోని శ్రీ ఉమా సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీ ఉదయం మైసూరు దత్త పీఠాధిపతి శ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామి అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన గణపతి హోమంలో పాల్గొన్నారు. మందిర ప్రాంగణంలోని శ్రీ కృష్ణ మందిరం, అష్టలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.

## వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం

నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేట పప్పుల వీధిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీ భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని కనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఉచితంగా వ్రత సామగ్రిని అందజేసారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది.

# శ్రీ నేతాజీలో ప్రొఫెషనల్స్ డే



వివిధ రకాల వృత్తులను, వృత్తి విశేషాలను పరిచయం చేస్తూ, రకరకాల వృత్తుల వారికి సంబంధించిన వృత్తి బాధ్యతలను ప్రదర్శించే కార్యక్రమం ప్రొఫెషనల్స్ డేను నెల్లూరు విజయమహల్ గేటు దగ్గరగల శ్రీ నేతాజీ పైలట్ హైస్కూలులో ఈనెల 8న నిర్వహించారు. కార్యక్రమంలో ప్లేక్లాసు నుండి ఐదవ తరగతి వరకు చదివే విద్యార్థులు డాక్టర్లు, పోలీసు, మంత్రులు, ప్లంబరు, కొయ్యపనివారు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, పూలవ్యాపారి, పండ్ల వ్యాపారి, గ్రీన్‌గ్రాసర్, వ్యాపారస్థులు, మెడికల్ రెప్రజెంటేటివ్, షాప్‌కీపర్, కలెక్టరు, కెమిస్ట్ మొదలగు వివిధ రకాల వృత్తులను ప్రదర్శించటం వల్ల విద్యార్థులకు అవగాహన వివిధ వృత్తులపట్ల ఇష్టాఇష్టాలు కలుగుతాయని స్కూలు కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి, సంస్థ డైరెక్టరు నరేంద్రరెడ్డి తెలియజేశారు. ఇలాంటి విశిష్ట కార్యక్రమాలు చేయటం వల్ల పిల్లలకు మానసికోల్లాసంతో పాటు ఒక ప్రొఫెషనల్ నిలబడేందుకు కావలసిన ధ్యేయం ఏర్పడుతుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.ప్రసన్న, వైస్ ప్రిన్సిపల్ డి.వాణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాణ్యమైన చదువును కొనాల్సి వస్తోంది

## నెల్లూరు జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ పెంచలరెడ్డి



సభలో ప్రసంగిస్తున్న ఏజేసీ సిహెచ్ పెంచలరెడ్డి

స్వాతంత్ర్యం వచ్చి 67 ఏళ్ళు దాటినా దేశంలో నిరుద్యోగం, పేదరికం అధికంగా ఉందని, పట్టణాలు అభివృద్ధి చెందినా పల్లెల్లో అభివృద్ధి జరగడం లేదని, నాణ్యమైన విద్యను కొనుగోలు చేయాల్సి రావడం దారుణమని నెల్లూరు జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక 13వ జిల్లా మహాసభలు నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ కార్యాలయంలో ఈ నెల 8న ప్రారంభమయ్యాయి. తొలుత పెంచలరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం ఉన్న జనవిజ్ఞాన వేదిక వంటి సంస్థలు విద్య, వైద్యం, ఆరోగ్యంపై ప్రజలను చైతన్యం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.శంకరయ్య, ఎల్ఐసి ఐసీఈయూ అధ్యక్షుడు నగేష్, జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గౌస్ బాషా, కె.కృష్ణారెడ్డి, డాక్టర్లు రాజేశ్వరరావు, శ్రీను నాయక్, సూర్య ప్రకాష్, సురేష్, తిరుపాలు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ నెల 9వతేది జరిగిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ అట్టడుగున ఉన్న సామాన్యునికి సైన్స్ ఫలాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సైన్స్, అభివృద్ధి అనేవి కొంత మంది ధనవంతుల చేతుల్లో బందీ అవుతున్నాయన్నారు. జిల్లాలోని సముద్రతీర ప్రాంతంలో విచ్చలవిడిగా నెలకొల్పుతున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలతో నెల్లూరు బూడిద కానుందని, విద్యుత్ కేంద్రాలకు అనుమతి ఇవ్వరాదన్నారు. ఇసుక మాఫియాను అరికట్టి భూగర్భ జలాలు పరిరక్షించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అధికారికంగా తెలుగుభాష ద్వారానే ఉత్తర, ప్రత్యుత్తరాలు జరపాలన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షుడు నగేష్, డాక్టర్లు రాజేశ్వరరావు, దత్తాత్రేయ, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హిజ్రాలకు పోలీసులు వార్నింగ్

నెల్లూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఒంటరిగా పోయే వ్యక్తులను, యువకులను అడ్డగించి వారిపై దాడిచేసి దోపిడీలకు పాల్పడుతున్న హిజ్రాలపై పోలీసులు చర్యలు చేపట్టారు. నెల్లూరు నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండవ నగర ఎస్సై సాంబశివరావు తమ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో తిరిగే హిజ్రాల వివరాలు సేకరించారు. ఈ నెల 10వ తేదీ వెంకటేశ్వరపురం జనార్ధన్‌రెడ్డి కాలనీకి చెందిన అయిదు మంది హిజ్రాలను బైండోవర్ చేసుకున్నారు. వారి పూర్తి వివరాలు సేకరించారు. వ్యక్తులను బెదిరించి, వారిపై దాడి చేసి డబ్బు, నగలు దోచుకున్న, ఇతర నేరాలకు పాల్పడ్డా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వారికి వార్నింగ్ ఇచ్చారు.

## మెగా బలిజ, తెలగ, కాపు

# వివాహ పరిచయ వేదిక

శ్రీ కృష్ణదేవరాయలు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 16న నెల్లూరు టౌనుహాలులో మెగా బలిజ, కాపు, తెలగ, వివాహ పరిచయ వేదిక నిర్వహించబడుతుందని వేదిక వ్యవస్థాపకులు ఏకోజి కోటేశ్వరరావు తెలిపారు. పరిచయ వేదికలో పాల్గొనే వారు రెండు ఫోటోలు తీసుకొని, తల్లిదండ్రులతో కలసిరావాలని తెలిపారు. వివరాలకు 93983 14847, 85005 62001నెంబర్లలో సంప్రదించమని పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పరిచయ వేదిక కార్యక్రమాలు వుంటాయని తెలిపారు.

# సెకండ్ కేడర్

(3వ పేజీ తరువాయి)

దిక్కున్నట్లున్నారు. ఉదయగిరిలోనూ పరిస్థితి ఇంతే. సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంకినపల్లి ఓబులరెడ్డి, మాజీ జడ్పీఛైర్మెన్ పి.చెంచలబాబుయాదవ్‌లు కాంగ్రెస్ టిక్కెట్‌రేస్‌లో వున్నారు.

ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేయడానికి ఉత్సాహపడుతున్న వారెవరిలో గెలుస్తామనే నమ్మకం లేదు. కాకపోతే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసామనే రికార్డు ఉంటుందని భావిస్తున్నారు. అంతేకాక ఎలక్షన్ ఫండ్ క్రింద పార్టీ ఎంతోకొంత ఇస్తుంది కాబట్టి ఆర్థికంగా ప్రయోజనం కూడా ఉంటుందని అంచనా!

# నాటుబాంబులతో బెంబేలు



నాటుబాంబులతో నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం గ్రామంలోని తూర్పు ముస్లింపాళెంలో గ్రామస్తులు బెంబేలు పడుతున్నారు. ఒక కుక్క కారణంగా అప్పారావు పాళెంలో నాటుబాంబులు వెలుగు చూసాయి. ఆహార పదార్థంగా భావించిన కుక్క నాటుబాంబును కొరకడంతో అదిపేలి అక్కడికక్కడే చనిపోయింది. ఆ తర్వాత అదే ప్రాంతంలో మరో ఏడు నాటు బాంబులు దొరకడంతో అప్పారావుపాళెం గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ఈ నెల 9వ తేది సాయంత్రం పెద్ద పేలుడు రావడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకుని పరిశీలించగా ఓ కుక్క చనిపోయివుంది. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ భర్త జనార్ధన్‌నాయుడుకు చేరవేశారు. ఈ నెల 10న పోలీసులు సమాచారాన్ని అందుకుని సిఐ వెంకటేశ్వరరావు ఎస్సైలు వేణుగోపాల్‌రెడ్డి, అంకమ్మ, సిబ్బంది గ్రామానికి చేరుకుని విచారించారు. కుక్క చనిపోయిన ప్రాంతంలో పరిశీలించగా ఐదు నాటు బాంబులు, పక్కనే గడ్డివాములో ఒక బాంబు, సమీపంలోని ఓ ఇంటి పక్కన ఉన్న ఇసుకలో మరో బాంబు లభించింది. పోలీసులు వీటిని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

నాటు బాంబులపై విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. అడవి పందులను చంపేందుకు బాంబులు పెట్టి ఉంటారని పోలీసులు చెబుతుండగా, పాతకక్షల నేపథ్యంలో ఎవరైనా బాంబులు పెట్టి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# పోలీసు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

నెల్లూరు జిల్లా పోలీసు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. మొదటి విడతగా రూ 19 కోట్లు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మొత్తాన్ని ఈ ఏడాది మార్చి 31 లోపు ఖర్చు చూపాలని షరతు విధించింది. ఈ నిధులతో జిల్లా పోలీసు కార్యాలయం, మహిళ పోలీసుస్టేషన్, నెల్లూరు సౌత్ ట్రాఫిక్ స్టేషన్, వెంకటాచల సత్రం, వాకాడు, పెళ్లకూరు, నెల్లూరు మూడవనగర పోలీసుస్టేషన్‌లతో పాటు, పోలీసు క్వార్టర్లను నిర్మించనున్నారు. రెండవ విడతలో మూలాపేట, నవాబుపేటల్లోని కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్ల పోలీసు కానిస్టేబుళ్ళు క్వార్టర్లను, గూడూరులో ఎస్సై, 8 హెడ్ కానిస్టేబుళ్ళు, పోలీసు కానిస్టేబుళ్ళు క్వార్టర్లను, గూడూరులో 2 సిఐ, 16 హెచ్‌సి, పీసి క్వార్టర్లు నిర్మించనున్నారు.

# నిర్భయంగా ఓటు వేయాలి

నెల్లూరు జిల్లా కోవూరు మండలం పడుగుపాడు చంద్రమౌళినగర్ గిరిజన కాలనీలో ఈ నెల 10న ఓటు విలువపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లాకలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఓటరు డబ్బు, మద్యం, బహుమతులు తదితర ప్రలోభాలకు లొంగి పోకుండా తమ ఓటు హక్కును నిర్భయంగా, సజావుగా వినియోగించి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఓటు హక్కును దుర్వినియోగం చేసుకొని తమ పిల్లల భవిష్యత్తును పాడు చేసుకోకూడదన్నారు. ఓటు హక్కుపై పూర్తి అవగాహనతో ఎన్నికల నిబంధనల మేరకు ఓటును వినియోగించుకొని గ్రామాభివృద్ధికి, తద్వారా రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. తదుపరి ఓటు హక్కు వినియోగంపై గిరిజన కళాజాతా, మార్పు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఐటీడిఓ పిఓ వై.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు బషీర్, ఐవిఎన్ నాయుడు, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



బదిలీ అయిన జేసీ లక్ష్మీకాంతంను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన బదిలీ అయిన ఏజేసీ సి.హెచ్.పెంచలరెడ్డి, డిఆర్ఓ బి.రామిరెడ్డిలు.

## నెల్లూరు కబుర్లు

## నెల్లూరులోనూ టీ-టెన్షన్

వరల్డ్‌కప్‌లో ఇండియా-పాకిస్థాన్‌ల మధ్య మ్యాచ్ జరుగుతుంటే ప్రజలు ఎంత టెన్షన్‌గా చూస్తారో ఇప్పుడు తెలంగాణ బిల్లు విషయంలోనూ అంతే టెన్షన్ నెలకొంది. విభజన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందుతుందా... లేక ఓడిపోతుందా? అనేది హాట్ టాపిక్‌గా మారింది.

విజ్ఞానవంతులే కాదు, అక్షరజ్ఞానం లేనివాళ్లు, రాజకీయ పరమైన అంశాలు పట్టించుకోని మహిళలు కూడా టీ-బిల్లుపై చర్చించుకుంటున్నారు. టీ-బిల్లు చర్చకు వచ్చినప్పుడు కాంగ్రెస్‌ను, సోనియాగాంధీని తిట్టని వాడు పాపాత్ముడు. ఇంతకుముందు ఆడోళ్లు సీరియల్స్ కోసమే టీవీలు పెట్టేవాళ్లు. కాని ఏ రోజుకారోజు టీ-బిల్లుపై ఏం మార్పులు సంభవించాయో తెలుసుకోవడానికి న్యూస్‌ఛానెల్స్ పెడుతున్నారు. నెల్లూరు నగరమంతా కూడా ఈ నెల 21దాకా టీ-ఫీవర్ ఉండేటట్లుంది.

## ఆనం నాలుగో బడ్జెట్



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి వరుసగా నాలుగో సారి రాష్ట్ర శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. జిల్లా నుండి వరుసగా నాలుగుసార్లు బడ్జెట్ పెట్టిన ఆర్థికమంత్రి ఆయనే. లక్షా83వేల కోట్లతో ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేసారు. బడ్జెట్‌లో జిల్లాకు ముఖ్యంగా తన ఆత్మకూరు నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు.

## ఘనంగా రత్నం స్ప్రింగ్స్ 2కె14 స్కూల్ లెవల్ ఫెస్ట్

డా॥కిషోర్స్ రత్నం ఫ్యూచర్ విజన్ స్కూల్ మాగుంట లే అవుట్‌లో స్ప్రింగ్స్ 2కె 14స్కూల్ లెవల్ ఫెస్ట్ ఈనెల 8న ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు 'జెస్ట్ ఏ మినిట్', సెమినార్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ల ద్వారా పర్యావరణ కాలుష్యం, అరణ్యాల పరిరక్షణ, జీవవైవిధ్యం, సేంద్రియ ఎరువులు వాడకం, జీవావరణ, బయోటెక్నాలజీ, సెల్‌ఫోన్, రేడియోధార్మికత, ఇంటర్‌నెట్ మొదలగు అంశాల గురించి కళ్ళకు కట్టినట్టుగా వివరించారు. కార్యక్రమంలో డా॥కిషోర్స్ రత్నం స్కూల్‌కు సంబంధించిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జెస్ట్ ఏ మినిట్ విభాగంలో పర్యావరణం పట్ల ఒక అంశం గూర్చి ఒక్క నిమిషంలో అనర్గళంగా మాట్లాడడం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి చక్కటి కార్యక్రమాలను రూపొందిస్తున్న డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందనీయులని, కేవలం ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా పుస్తకాలకే పరిమితం కాకుండా ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం వలన విద్యార్థులు వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఈ స్ప్రింగ్ 2కె 14కు సంబంధించిన సావనీర్‌ను మువ్వా రామలింగం చేతుల మీదుగా హర్షధ్వానాల మధ్య ఆవిష్కరించడం జరిగింది.



ఈ కార్యక్రమంలో డా॥కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, డా॥కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ప్రిన్సిపల్ గీత, ఏఓలు రాధాకృష్ణ, రాజ్‌గార్ల మరియు ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డిఎస్ఓగా శాంతకుమారి



నెల్లూరు కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని డిఎస్ఓ కార్యాలయంలో ఈ నెల 10న డిఎస్ఓగా శాంతకుమారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. జిల్లా అధికారుల ఆదేశాలు, సహచర ఉద్యోగుల సహకారంతో నెల్లూరు జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేస్తానన్నారు. గతంలో కూడా నెల్లూరు జిల్లాలో పని చేశానని ఆ అనుభవంతో తన విధులను సక్రమంగా నిర్వహించి పేద ప్రజలకు సేవలందిస్తానన్నారు.

## తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ భానుప్రసాద్ బదిలీ

నెల్లూరు తెలుగు గంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ చదలవాడ భానుప్రసాద్, రాజమండ్రి ఇందిరాసాగర్ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతమ్మను గాలేరునగరి సుజల స్రవంతి (తిరుపతి) భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేసారు. అక్కడ పనిచేస్తున్న బాబయ్యను పద్మావతమ్మ స్థానంలో నియమించారు. ఆత్మకూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎల్.నరసింహంను గుంటూరు భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా నియమించినట్లు సమాచారం.

## క్విజ్ పోటీలు మెదడుకు పదును పెడతాయి



సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధార్థబసు

క్విజ్ పోటీలు మెదడుకు పదును పెడతాయని, విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు ఎంతో దోహదపడతాయని ప్రముఖ క్విజ్ మాస్టర్ సిద్ధార్థబసు అన్నారు. ఈ నెల 8న నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాళెంలోని నారాయణ వైద్య కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యం ఎంతో విలువైందని, ఆ దశలో ప్రతిభ చాటినట్టయితే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. 8వ తరగతిలోపు విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నారాయణ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సింధూర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్‌లు పాల్గొన్నారు.

## వేపదొరువులో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం





నెల్లూరు ఎన్‌టిఆర్ నగర్ దగ్గరున్న శ్రీ వేణుగోపాల స్వామి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థినీ విద్యార్థులు ఇటీవల వేపదొరువు ప్రాంతంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా॥సి.హెచ్.నారాయణరెడ్డి, డా॥పి.కొండారెడ్డిల ఆధ్వర్యంలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లైన విద్యార్థులు వేపదొరువు సమీపంలో మొక్కలు నాటి, పర్యావరణం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పచ్చదనం ప్రాధాన్యత, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో శ్రీ వేణుగోపాలస్వామి జూనియర్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆర్.వి.ఎస్.ప్రసాద్, టి.వి.అశోక్‌కుమార్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎడాపెడా విద్యుత్ కోతలు

**- ఇబ్బంది పడుతున్న ప్రజలు -**

నెల్లూరు నగరంలో ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. సంతపేట ప్రాంతంలో మరీ ఎక్కువగా కోతలు విధిస్తుండటంతో స్థానిక ప్రజలు అల్లాడుతున్నారు. నగరంలో విద్యుత్ కోతలు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు విధిస్తే, ఇక్కడ మాత్రం ఈ నెల 10వ తేదీ 3 గంటల నుండి సాయంత్రం 6.45 గంటల వరకు కోతలు విధించారు. ట్రాన్స్‌కో సిబ్బందికి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తగినంత ఓల్టేజ్ లేకపోవడంతో ట్యూబ్‌లైట్లు, బల్బులు కాలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్‌ఛార్జ్‌లంటూ కరెంట్ బిల్లులు మండిపోతున్నాయని, ఇంకెన్నాళ్ళు ఇలా సర్‌ఛార్జ్‌లు చెల్లించాలని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

## నాణ్యత లోపిస్తే అధికారులపై చర్యలు

**నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు**

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి హెచ్చరించారు. నెల్లూరు 4వ డివిజన్ పరిధిలోని వేణుగోపాలనగర్‌లో రూ.7.5 లక్షల వ్యయంతో వేస్తున్న డ్రైనేజీ కాలువ, మధురానగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో వేస్తున్న డ్రైనేజీ కాలువ పనులకు ఈనెల 9న ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముంగమూరు మాట్లాడుతూ నగరాభివృద్ధికి ఇప్పటి వరకు రెండువేల కోట్ల రూపాయలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలకసంస్థ మునిసిపల్ ఇంజినీర్ సంపత్‌కుమార్, డిఈఈ సుందరరామిరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం

నెల్లూరు నగరం భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ కార్యాలయంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక 13వ జిల్లా మహాసభల ముగింపు సందర్భంగా సంస్థ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల నుంచి వచ్చిన ఎన్నికల పరిశీలకులు జితేంద్ర, శ్రీనాథులు పర్యవేక్షించారు. పాత కమిటీ కార్యదర్శి కృష్ణారెడ్డి నూతన కమిటీని ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జెవివి జిల్లా నూతన అధ్యక్షుడిగా సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.కృష్ణారావు, కోశాధికారిగా పార్వతీశంను ఎన్నుకున్నారు. కార్యవర్గసభ్యులు 20మందిని ఎన్నుకున్నారు.

## దరఖాస్తులకు డిమాండ్ పెరిగింది

కేంద్రీయ విద్యాలయంలో పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతుండడంతో దరఖాస్తులకు డిమాండ్ పెరిగింది. 2014-2015 విద్యా సంవత్సరంలో ఒకటవ తరగతి ప్రవేశానికి ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులను ఇస్తున్నారు. ఒకటవ తరగతిలో 41 సీట్లుకుగాను 30 సీట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయిస్తారు. మిగిలిన 11 సీట్లలో ఆరు ఎస్సీలకు, మూడు ఎస్టీలకు, ఒకటి వికలాంగులకు, మరొకటి ఆర్థికంగా వెనుకబడిన వర్గానికి కేటాయిస్తారు. మొదటి రోజే 150 దరఖాస్తులను తల్లిదండ్రులు తీసుకెళ్ళారు. మార్చి10 వరకు ఈ ప్రక్రియ సాగుతుంది.

## ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ల నియామకం

నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. జిల్లాలో దాదాపు 50 డాక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ వెలువడగా 50మందికిపైగా డాక్టర్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి హైదరాబాద్‌లో ఈనెల 7న కౌన్సిలింగ్ నిర్వహించి అర్హులను ఎంపిక చేసారు. నెల్లూరు జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో వీరిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఈ నెల 8వ తేదీ 17 మందిని, 10వ తేదీ 10 మందిని వివిధ ఆరోగ్య కేంద్రాల్లో నియమించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కోటేశ్వరి తెలిపారు.

# సమైక్య సత్తా చాటుదాం

**సింహపురి సమాచారం**



సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా రాష్ట్ర పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేది సాయంత్రం నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్ నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు నిర్వహించిన సమైక్య రన్ సక్సెస్ అయింది. పార్టీలకు అతీతంగా నాయకులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, పెద్ద సంఖ్యలో మహిళలు ఈ రన్‌లో పాల్గొన్నారు. కళాకారుల తప్పెట్లు, తాళాలతో, నృత్యాలతో ట్రంకురోడ్డు మీదుగా సమైక్యరన్ ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభలో మూజువాణి ఓటుతో తిరస్కరించి పంపిన తెలంగాణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం అప్రజాస్వామికమన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సీమాంధ్రులు ఉద్యమం ద్వారా తమ సత్తా చాటాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీలకతీతంగా ముక్తకంఠంతో విభజన బిల్లును తిరస్కరించి ఆంధ్రుల ఐకమత్యాన్ని నిరూపించుకోవాలన్నారు. తెలంగాణకు చెందిన జగ్గారెడ్డి, ముఖేష్‌గౌడ్, నాగేంద్ర తదితర నాయకులు సమైక్యాంధ్రనే కాంక్షిస్తున్నారన్నారు. హైదరాబాద్‌ను తెలంగాణకు ఇస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

## తండ్రి అడుగు జాడల్లో నడుస్తా

**- ఆనం జయకుమార్‌రెడ్డి**



సమైక్యాంధ్ర కోసం 40 ఏళ్ళ క్రితం అప్పటి నెల్లూరు ఎమ్మెల్యే, తన తండ్రి ఆనం వెంకటరెడ్డి ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడ్డారని మాజీ కార్పొరేటర్ ఆనం జయకుమార్‌రెడ్డి అన్నారు. ఏపీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు, సమైక్యాంధ్ర రాష్ట్ర పరిరక్షణ వేదిక ఛైర్మన్ సి.రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన సభలో విద్యుత్ ఉద్యోగుల జేఏసి నాయకుడు సాయిబాబా, రమణారెడ్డి, సుధాకర్‌రావు, సతీష్, శ్రీకాంతరావు, మంజు, కరుణమ్మ, స్వరూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ విద్యార్థిని లాస్యప్రియ(6వ తరగతి) సమైక్యాంధ్ర గురించి మాట్లాడిన ప్రసంగం, బాలకృష్ణ ఆలపించిన సమైక్య గీతాలు సభలో అందరిని ఆకట్టుకున్నాయి.

## షార్ డైరెక్టర్ ప్రసాద్‌కు సన్మానం



నెల్లూరు జిల్లా శ్రీహరి కోట సతీష్ థావన్ స్పేస్ సెంటర్(షార్) డైరెక్టర్ డాక్టర్ ఎం.వై.ఎస్.ప్రసాద్‌ను ఈ నెల 10న ఆయన ఛాంబర్‌లో సత్కరించారు. భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంతో నాయుడుపేట ఆర్డీఓ ఎన్.వెంకటరమణ, మునిసిపల్ కమీషనర్ నామా కనకారావులు ప్రసాద్‌ను సన్మానించారు. షార్ డైరెక్టర్ ఆధ్వర్యంలో భారీ ప్రయోగాలను విజయవంతం చేసి ఉన్నతమైన అవార్డులను అందుకోవాలని ఆకాంక్షించారు.

# సీమాంధ్రకు న్యాయం... బీజేపీ ధ్యేయం

సీమాంధ్రకు న్యాయం జరిగే విభజన బిల్లుకే తమ పార్టీ మద్దతునిస్తుందని బీజేపీ జాతీయ నాయకులు, రాజ్యసభసభ్యులు యం.వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన నెల్లూరులోని తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న రాష్ట్రాలు మా పార్టీ విధానం. తెలంగాణ ఏర్పాటుపై మా విధానం మారలేదు. కాని అంతకంటే ముందు సీమాంధ్రకు న్యాయం జరగాలి. కాని కాంగ్రెస్ వాలకం చూస్తుంటే రాజకీయ ప్రయోజనాల కోసమే తెలంగాణ బిల్లును రూపొందించినట్లుగా వుంది. తొమ్మిదిన్నరేళ్లపాటు తెలంగాణ అంశాన్ని నాన్చింది. ఇప్పుడు ఆదరాబాదరా బిల్లును రూపొందించి ఒక ప్రాంతంలోనైనా సీట్లొస్తాయనే ఆశతో పార్లమెంట్‌లో ఆమోదించాలంటుంది. తప్పులతడకగా వున్న బిల్లును తెచ్చి మా మద్దతు కోరు



తుంది. రాష్ట్ర విభజన భావోద్వేగాలతో కూడుకున్న సున్నితమైన అంశం. కాని దురదృష్టవశాత్తు ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ నాటుగా మోటుగా వ్యవహరిస్తుంది. పరస్పర సంప్రదింపులు, సమస్యలు పరిష్కరించుకోవడం ద్వారా మాత్రమే రాష్ట్రాలను విభజించగలం. కాంగ్రెస్‌కు ఆ స్పృహ కొరవడింది. అసమగ్రంగా వున్న బిల్లుకు మా కణతకు తుపాకీ గురిపెట్టి మద్దతు కోరుతుంది. బిల్లు రూపకల్పనలో బీజేపీని పట్టించుకోని కాంగ్రెస్ ఇప్పుడు మా మద్దతు కోసం పాకులాడుతోంది. తెలంగాణ అక్కడి ప్రజల ఆకాంక్ష. అభివృద్ధి సీమాంధ్ర ఆశయం. ఈ రెండింటిని నెరవేర్చే బిల్లుకు మాత్రమే మా మద్దతు ఉంటుందని వెంకయ్యానాయుడు చెప్పారు.

బిల్లుకు మద్దతు కోసం కాంగ్రెస్ నాయకులు దిగ్విజయ్‌సింగ్, అహ్మద్‌పటేల్, దాసరి జైరాంరమేష్‌లు మా వద్దకు వచ్చారు. ఇరు ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన కొన్ని సవరణలను సూచించాం. అయితే మేం ప్రతిపాదించిన సవరణలలో ఒక్క పోలవరం తప్ప మిగతా సవరణలను కేంద్ర కేబినెట్

(మిగతా 9వ పేజీలో)

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


ఆత్మబంధు... ఆత్మీయ సింధు...
అక్కినేనికి అశ్రునివాళి



అక్కినేని గారూ!
మీరు భౌతికంగా దూరమయినా
మీ ప్రేమ... వాత్సల్యం
మీతో స్నేహం... ఆత్మీయత
నా ప్రాణం వున్నంతవరకూ
నా గుండెల్లో ప్రతిధ్వనిస్తూ...
నాకు తోడుగా వుంటాయి...

గత 50సంవత్సరాలుగా
స్నేహితునిగా... శ్రేయోభిలాషిగా
ఇరుగు పొరుగు వాళ్లుగా
కలిసిమెలిసి వున్న మిమ్మల్ని
నా జీవితంలో
ఎలా మరచిపోగలను!

ఎవర్‌గ్రీన్ హీరో అక్కినేనితో
నా ఆత్మీయ అనుబంధం
చిరస్మరణీయం!
ఆయన ఆత్మశాంతికై
పరమేశ్వరుణ్ని ప్రార్థిస్తూ...
టి.సుబ్బరామిరెడ్డి
M.P.



# కిడ్నాప్‌లతో టీ-బిల్లుకు మద్దతు

దోమల కథలు

అది ఢిల్లీలోని మూర్ఖులమాయామహల్ అయిన టెన్‌జనపథ్. సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్‌గాంధీ, దిగ్విజయ్‌సింగ్, షిండే, చిదంబరం, వీరప్పమొయిలీ, కేసీఆర్, మనీష్ తివారి, అహ్మద్ పటేల్, జైపాల్‌రెడ్డిలు సమావేశమై ఉన్నారు. దిగ్విజయ్ సింగ్ ఉండి... మేడమ్, అదిరించో, బెదిరించో, రాజ్యాంగాన్ని ఉల్లంఘించో తెలంగాణ బిల్లును పార్ల మెంటు దాకా తీసుకొచ్చాం... ఇక ఆమోదం పొందితే సీమాంధ్రులు అడుక్కుతింటుంటే చూడాలన్న మీ కోరిక నెరవేరుతుంది. మీ కళ్లల్లో ఆనందం చూడాలన్న మా కల సాకారమవుతుంది. కాని బిల్లు ఇక్కడిదాకా వచ్చేసరికి బీజేపీ పెండింగ్ పెడుతుంది. సీమాంధ్రుల సమస్యలను పరిష్కరించడానికి వాళ్లు ఇచ్చిన సవరణలను చేరిస్తేనే బిల్లుకు మద్దతిస్తారట... ఈ బిల్లు తెచ్చిందే సీమాంధ్రులకు సమస్యలను సృష్టించడానికి... వాళ్లకు సమస్యలు లేకుండా చేయడానికైతే అసలు విభజన ఎందుకు. బీజేపీ మద్దతు లేకుంటే బిల్లును గట్టెక్కించడం కష్టం మేడం అని చెప్పాడు. అప్పుడు సోనియా... ప్రతిదానికీ ఏదో ఒక మార్గం ఉంటుంది, వెదకండి అంది. దానికి దాసరి జైరాంరమేష్... మేం అప్పటికీ బీజేపీ వాళ్ల దగ్గరకెళ్లి... బెదిరించాం. మాట వినకుంటే బ్రతిమలాడాం కూడా... అయినా వాళ్లు సీమాంధ్ర సమస్యల పై పేచీ పెడుతున్నారని వాపోయాడు. దానికి సోనియా... బాగా ఆలోచిస్తే దీనికి పరిష్కారం లేకుండా పోలేదు. బీజేపీని ఎలా దారికి తేవాలో ఆ దేవుడే మనకు సూచిస్తాడు అని చెప్పింది. అంతలో ఒక పేపర్‌బాయ్ వచ్చి... 'ఈనాడు' పేపర్‌ను అక్కడ వేసి వెళ్లిపోయాడు. సోనియా ఆ పేపర్‌ను చూసింది. ఆమె కళ్లు ఓ హెడ్డింగ్ మీద ఆగిపోయాయి. 'మా కణతకు తుపాకీ గురిపెట్టి బిల్లుపై మద్దతు అడుగుతున్నారు' అని హెడ్డింగ్. అది బీజేపీ జాతీయ నాయకుడు యం.వెంకయ్యనాయుడు ఇచ్చిన స్టేట్‌మెంట్. దానిని చూడగానే సోనియాగాంధీ కళ్లు మెర్క్యూరీ బల్బుల్లా మెరవసాగాయి. చూసావా... దిగ్విజయ్, టైంకు ఆ దేవుడే మనకు దారి చూపించాడు. ఈ విభజన బిల్లు కోసం ఇప్పటివరకు మీరెంతో శాంతి యుతంగా, సహనంగా కృషి చేసారు. అన్ని పనులు శాంతియత్నాలతోనే పూర్తి కావు, సామదాన బేధ దండోపాయాలతో మనకు కావాల్సిన పనులు పూర్తి చేసుకోవాలి. ఇప్పుడు శాంతి, సహనం అంకం ముగిసింది. క్రైం పార్ట్ మొదలు పెట్టండి అంటూ దిగ్విజయ్‌సింగ్, షిండే, దాసరి జైరాంరమేష్‌లను పక్కకు పిలిచి వారి చెవిలో రహస్యంగా ఏదో చెప్పింది.

★★★★★

జాతీయ, అంతర్జాతీయ టీవీలన్నీ బ్రేకింగ్ న్యూస్‌తో హోరెత్తిస్తున్నాయి. బీజేపీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ కుమారుడు కిడ్నాప్, సుష్మాస్వరాజ్ కుమార్తె కిడ్నాప్, వెంకయ్యనాయుడు అమ్మమ్మ కిడ్నాప్, అరుణ్‌జైట్లీ ఇంట్లో కుక్క కిడ్నాప్, అద్వానీ ఇంట్లో గేదె మాయం... ఒకేసారి ఇన్ని కిడ్నాప్‌లు జరగడంతో, అది కూడా అన్నీ బీజేపీ నాయకులకు చెందినవే కావడంతో సంచలనమైపోయింది. అన్ని టీవీ ఛానెల్స్ అయితే... ఈ కిడ్నాప్‌ల వెనుక ఎవరున్నారు? లష్కరే తోయిబా పనా, ఇండియన్ ముజాహిద్దీన్ పన్నాగమా? ఆల్‌ఖైదా వ్యూహమా? తాలిబన్‌ల దుశ్చర్యా..? మీరు ఎవరనుకుంటున్నారో వూహించి మాకు పంపితే అందులో కరెక్ట్‌గా సమాధానం వ్రాసి పంపినవారిలో లక్కీడిప్ ద్వారా విజేతను ఎంపికచేసి బహుమతినందజేస్తామని టీవీ ఛానెల్ యాంకర్‌లు ప్రకటిస్తున్నారు. ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో కూర్చొని ఈ వార్తలు చూస్తున్న అద్వానీ, రాజ్‌నాథ్ సింగ్, వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీలకు ముచ్చెమటలు పడుతున్నాయి. తమ వాళ్లను ఎవరు అపహరించారో వారికి అంతుబట్టడం లేదు. వాళ్లలో టెన్షన్, బాధ... ఏ నిమిషానికి ఏం వినాల్సి వస్తుందో నన్న భయం. ఏ క్షణంలో ఫోన్ మోగుద్దో, కిడ్నాపర్లు ఎలాంటి డిమాండ్లు చేస్తారోననే ఆతృతతో అందరూ ల్యాండ్‌ఫోన్ చుట్టే కూర్చున్నారు. అంతలో అక్కడ ఫోన్ రింగయ్యింది. బీజేపీ నేతల గుండెలు అంతకంటే వేగంగా రింగ్ కాసాగాయి. వెంకయ్యనాయుడు వణికే చేతులతో ఫోన్ ఎత్తి 'హలో' అని అన్నాడు. అవతల నుండి.. హా హా హా అంటూ ఒక భయంకరమైన నవ్వు... ఎవరండి మీరు అని వెంకయ్య ఎంతో వినయంగా అడిగాడు. 'కిడ్నాపర్స్' అంటూ అవతలి కంఠం కర్కశంగా జవాబిచ్చింది. ఏం కావాలి మీకు... ఏ గ్రూపు తీవ్రవాదులు మీరు... ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాం. దయచేసి వాళ్లను వదిలిపెట్టండి అని వెంకయ్య ప్రాధేయపడ్డాడు. దానికి అవతల కిడ్నాపర్... ఒక వందకోట్లు ఇవ్వగలరా అని అడిగాడు. అందుకు వెంకయ్య... అంతిచ్చుకోలేంగాని వెయ్యినూట పదహార్లకు సర్దుకోండి అని కోరాడు. అందుకు అవతల వ్యక్తి... ఈ పేద ఏడుపెందుకుగాని, ఓ పని చేయండి, పార్లమెంటులో తెలంగాణ బిల్లుకు మద్దతు ఇవ్వండి. బిల్లు ఆమోదం పొందాక మీ వాళ్లందర్నీ వదిలి పెడతాం అని చెప్పాడు. దానికి వెంకయ్య... ఇంతకీ మీరెవరు సార్ అని అడిగాడు. అందుకు అవతల వ్యక్తి... 'సోనియా తెలంగాణ ఫైటర్స్' అంటూ ఫోన్ పెట్టేసాడు. వెంకయ్య ఫోన్‌లో జరిగిన సంభాషణంతా మిగతా నాయకులకు చెప్పాడు. దీనివెనుక ఏదో కాంగ్రెస్ కుట్ర ఉందని వాళ్లు అనుమానించసాగారు. ఈ బెదిరింపులకు భయపడి మనం ఏకపక్షంగా వున్న టీ-బిల్లుకు మద్దతునిస్తే సీమాంధ్రకు ద్రోహం చేసిన వారిమవుతాం. అలాగని మనవాళ్లు వాళ్ల దగ్గర వున్నారు కాబట్టి మూర్ఖంగా పోలేం. ఈ సమస్య నుండి మనల్ని కాపాడేదెవరురా దేవుడా అంటూ అందరూ ఆకాశంకేసి చూసారు.

★★★★★

టెన్‌జనపథ్‌లో సోనియా, షిండే, దిగ్విజయ్, జైరాం రమేష్‌లు వున్నారు. బీజేపీ ఆఫీసుకు ఫోన్ చేసారా అని సోనియా అడిగింది. దిగ్విజయ్ వుండి... నేనే ఫోన్ చేసా మేడమ్, వెంకయ్యనాయుడు ఎత్తుకున్నాడు. కిడ్నాపర్స్ లాగా మాట్లాడాను, బిల్లుకు మద్దతిస్తేనే మీ వాళ్లను విడిచిపెడతామని చెప్పాను, నా గొంతును అతను గుర్తు పట్టకుండా నోటికి గుడ్డకట్టుకుని మాట్లాడా... కిడ్నాపర్స్ ఎలా మాట్లాడతారో రాత్రి రెండు క్రైమ్ సినిమాలు చూసి తెలుసుకున్నా... మన ఫోన్ దెబ్బకు వాళ్లు దిగొస్తారు. ఖచ్చితంగా బిల్లుకు మద్దతు పలుకుతారు అని చెప్పాడు. అసలు కిడ్నాప్ వ్యవహారాన్ని ఇంత సులభంగా ఎలా నడిపించగలిగారని సోనియా అడిగింది. దానికి షిండే... ముగ్గురం కలిసి మారుతీవ్యాన్‌ను బేరమాడి బాడుగకు తీసుకున్నాం. బీజేపీ నాయకుల పిల్లలు ఎక్కడెక్కడికి పోతారనే దానిపై రెక్కీ నిర్వహించాం. మేం ముగ్గురం ముఖాలకు మాస్కులు ధరించి వారందరినీ కిడ్నాప్‌చేసి ఢిల్లీ శివార్లలోని పాడుబడ్డ బంగ్లాలో బంధించామని చెప్పాడు. సోనియా వారిని అభినందిస్తూ లేచింది.

★★★★★

అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, వెంకయ్య నాయుడులు నెల్లూరులోని స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64) ఇంటికొచ్చారు. కిడ్నాప్ విషయాన్ని ఆయనకు చెప్పి ఈ సమస్యను మీరే పరిష్కరించాలని కోరారు. వాళ్ల పరిస్థితి చూసి వివేకాకు జాలేసింది. మీవాళ్లను ఎవరో కిడ్నాప్ చేసి వుండరు, మా దిగ్విజయ్, షిండేల పనే అయ్యుంటుంది. ఎందుకంటే ఈమధ్య తెలంగాణ కోసం వాళ్లు కత్తులు పట్టి యుద్ధం చేయడానికైనా సిద్ధంగా ఉన్నారు. ముల్లును ముల్లుతోనే తీయాలి. క్రైంని క్రైంతోనే ఛేదించాలి. ఇప్పుడే మీ వాళ్లను విడిపిస్తానుండండి అంటూ తన పి.ఏ సెల్‌ఫోన్ తీసుకుని టెన్‌జనపథ్‌లోని ల్యాండ్‌లైన్‌కు రింగ్ చేసాడు. అవతల సోనియా గాంధీ ఫోన్ ఎత్తింది. వివేకా నోటికి గుడ్డ అడ్డం పెట్టుకుని... సీమాంధ్ర ఛీటాస్ ఫ్రంట్ అధ్యక్షుడిని మాట్లాడు తున్నా... గుజరాత్‌లోని అహ్మదాబాద్ సభలో మీ కొడుకు రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నాడు. మా వాళ్లు రెండుటన్నుల నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలను పట్టుకుని అక్కడ వదలడానికి సిద్ధంగా వున్నారు. ఢిల్లీలో మీ వాళ్లు కిడ్నాప్‌చేసిన బీజేపీ నేతల పిల్లలను, కుక్కలను వదలకపోయారో... అక్కడ మా వాళ్లు దోమలు వదులుతారు. జాగ్రత్త అని హెచ్చరించాడు. ఆ మాటలకు సోనియాకు ముచ్చెమటలు పట్టాయి. భయంతో ఆమె వద్దొద్దు... అంత పనిచేయొద్దు. వాడు వట్టి అమాయకుడు. మీ వాళ్లను ఇప్పుడే వదిలేస్తాం అని ఫోన్ పెట్టేసింది. వివేకా ఫోన్ కట్ చేసి... బీజేపీ నేతలతో... మీరొచ్చిన పనైపోయింది... మీ వాళ్లు ఓ అరగంటలో మీ ఇళ్లల్లో ఉంటారని చెప్పాడు. బీజేపీ నేతలంతా వివేకాకు కృతజ్ఞతలు చెప్పుకుని ఢిల్లీకి బయల్దేరారు.

కదంబం

## పస్తు


నన్నపనేని రవి,
రావినూతల, 99636 71531.

ఇంట్లో
బియ్యం లేక
పొయ్యిలో పిల్లి పడకేసినప్పుడు
తొండం స్వామి పండక్కి
తెలియక వొక్క పొద్దున్నప్పుడు
బంతి
ఆయువు పట్టున తగిలి
ఆత్మీయ మిత్రుడు
ఆటస్థలంలోనే కూలిపోయినప్పుడు
నేను పస్తున్నా

తలాపన
దీపం పెట్టడానిక్కూడా దిక్కులేని కాలంలో
అమ్మమ్మ కన్ను మూసినప్పుడు
వంద కాగితం ఒక రూపాయిలా
వాడుతున్నానని
ఆర్థిక పెత్తనం అంతా
ఆమె చేతుల్లోకి ఓ వారం లాక్కున్నప్పుడు
అహంకార అధికారి
కరుకు నోటి ముందు మాట దురుసు ముందు
ఆత్మాభిమానం దెబ్బతిన్నప్పుడు
నేను పస్తున్నా
అప్పడప్పుడు
నాలిక చేదెక్కీ ఒళ్ళు వేడెక్కీ
అన్నం సయించనప్పుడు
నేను పస్తున్నా
పస్తు
వ్యాధినిరోధకానికి ఒక కారకం
పొట్టంతా పులిసిపోయి పట్టెడన్నం
విషమయిపోయి
జబ్బునపడ్డ
మనిషికైనా మృగానికైనా పస్తే కదా పెద్ద
వైద్యరాజం
ఉపవాసం
ఒక దీక్ష మాత్రమేనా
అదొక ప్రాథమిక ఆరోగ్య సూత్రం
ఇవాళ
పొద్దున్నే అతనన్నాడు
కవిత్వం రాయనిపొద్దూ కవిత్వం చదవని
పొద్దూ
భోజనం ముట్టుకోవద్దనీ
అజీర్తికైనా
ఆలోచనా బద్ధకానికైనా
లంఖణం పరమౌషధమనీ
ఉంటాను
పస్తుంటాను
కవిత్వం నా ప్రాణం కవిత్వం నా దేహం
అది నా హృదయంలో
రోగక్రిమిని ధ్వంసం చేసే తెల్లరక్త కణం
(మంత్రి కృష్ణమోహన్‌కి)

## కథలు జీవితంలో భాగంకావాలి

డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి



కథలు జీవితంలో భాగం కావాలని వాటిని పుస్తకంగా పాఠకుల ముందుకు తీసుకొచ్చిన రచయిత ఉమామహేశ్వరరావు అభినందనీయుడని కాకినాడకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మిదేవి పేర్కొన్నారు. కథారచయిత ఆర్ఎం ఉమా మహేశ్వరరావు 13భారతీయభాషల్లో తొలి కథలను సేకరించి తెలుగులోకి అనువదించిన "తొలికథలు" సంకలనాన్ని ఆదివారం ఆమె సమీక్షించారు. ప్రభవస్కూల్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాడ్రేవు మాట్లాడుతూ కథల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చున్నారు. 13రకాల మాండలికాల్లో సాగిన ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉందన్నారు. రచయిత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాషలో తొలి తెలుగు కథ ఏదీ అనే విషయంపై ఇప్పటికీ చర్చ జరుగుతూనే ఉందన్నారు. కథల ద్వారా సమాజానికి ఎంతో సందేశాన్ని ఇవ్వవచ్చున్నారు.

ప్రభవ స్కూలు నిర్వాహకురాలు చంద్రలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

16న యక్కలూరి శ్రీరాములు

## "పోతన భాగవతం" ఆవిష్కరణ

ప్రముఖ కవి యక్కలూరి శ్రీరాములు రచించిన పోతన భాగవతం పుస్తకావిష్కరణ ఈనెల 16న తిరుపతిలోని తీర్థకట్టవీధిలో గల అన్నమాచార్య మందిరంలో జరుగుతుందని హైదరాబాద్‌లోని కౌండిన్య పబ్లిషర్స్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వైదిక విశ్వవిద్యాలయం ప్రధాన అధికారి డా॥ఆకెళ్ళ విభీషణశర్మ, నెలవంక నెమలీక మాసపత్రిక సంపాదకులు లక్కరాజుదేవి, శ్రీ శ్రీనివాస బ్రహ్మోత్సవ కళ్యాణోత్సవ వ్యాఖ్యాత సముద్రాల రంగనాథాచార్యులు, హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రత్యేక అధికారి, శ్రీరామ్ రఘునాథ్ అన్నమాచార్య ప్రాజెక్టు నిర్వహణాధికారి సముద్రాల లక్ష్మయ్య, ప్రముఖ కవయిత్రి కోడూరి సుమనలు పాల్గొంటారని తెలిపారు. సాహితీమిత్రులందరూ పుస్తకావిష్కరణ మహోత్సవంలో పాల్గొనమని వారు ఆహ్వానిస్తున్నారు.

## వైభవంగా రంగడి బంగారు గరుడసేవ

నెల్లూరు నగరంలోని రంగనాయకులపేట శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 10వ తేది శ్రీ స్వామి వారికి వైభవంగా బంగారు గరుడసేవ ఉత్సవం జరిగింది. ఈ మహోత్సవంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు స్వామి వారికి తిరుమంజనం, విశేషపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుండి, ఆదాయం పెరుగుతుంది. నిర్మాణాలు, గృహ రిపేర్ల వంటివి చేపట్టుతారు. ఆర్థికలావాదేవీలు ఇంట బయట వ్యవహారాలు సమర్థవంతంగా నిర్వహించగలరు. షేర్లపై ఆదాయం ఉంటుంది. పనులందు టెన్షన్ ఉంటుంది. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు లభిస్తాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో ఆర్థికావకాశాలు బాగుంటాయి. ఆదాయం పెరుగుతుంది. పనులు నిర్వహించేటప్పుడు ఘర్షణాత్మక వైఖరి లేకుండా సామరస్యంగా ఉండండి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, స్థిరాస్తులు భూములవంటి వాటి క్రయవిక్రయాలు జరుగగలవు. ఉద్యోగులు అసోసియేషన్ కార్యక్రమాలలో పాల్గొంటారు. పనిభారం పెరుగుతుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపకాలు పెరిగి ఆదాయం బాగుంటుంది. వ్యాపారాలలో పోటీని అధిగమించి అవకాశాలు, ఆదాయాన్ని పెంచుకుంటారు. స్థిరాస్తులు, షేర్ల మీద లాభాలుంటాయి. ముఖ్యపత్రాలు, వస్తువులు జాగ్రత్త. ఉద్యోగులకు అధికారుల అండదండలుంటాయి. ఉద్యోగార్థులు ఉద్యోగ అన్వేషణ పెంచి, అవకాశాలు పొందుతారు. వాహన ఫైనాన్స్, చీటీల వ్యాపారులు జాగ్రత్త పడాలి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి వ్యాపారాలలో పోటీలను అధిగమించి ఆర్థికంగా అభివృద్ధి సాధించగలరు. ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాల ఖర్చులు, ఇంటి ఖర్చులు కూడా పెరుగుతాయి. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరుగుతాయి. విద్యాప్రగతి బాగుంటుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుండవచ్చును. అనుకున్న పనులు పట్టుదలతో సాధించుకుంటారు. బ్యాంకు ఋణాలు పొందుతారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 14.02.2014 నుండి
తేది. 20.02.2014 వరకు

ఈ వారం మేషంలో కేతువు, మిధునంలో గురువు, సింహ కన్య తులరాశులలో చంద్రుడు, తులలో కుజ శని రాహువులు, ధనుస్సులో శుక్రుడు, కుంభంలో రవి బుధులు, 18 తేది నుండి మకరంలో వక్రబుధుడు సంచరిస్తారు.

### ముహూర్తములు

తేది 17 సోమవారం రాత్రి 7.20 నుండి 9.28లోగా కన్యాలగ్నమున గృహ ప్రవేశము. తేది 19 బుధవారం ఉదయం గంట 11.0 నుండి 12.0లోగా వృషభలగ్నమున వివాహ వ్యాపార శంకుస్థాపనలు. తేది 20 గురువారం రాత్రి 7.10 నుండి 9.16లోగా కన్యా లగ్నమున వివాహము.

### మాఘమాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | శుక్ర | పూర్ణిమ | రా॥గం.04.53వ॥ |

### మాఘమాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శని | పాడ్యమి | పూర్తిగ |
| తేది. 16 | ఆది | విదియ | పూర్తిగ |
| తేది. 17 | సోమ | విదియ | ఉ॥గం.08.02వ॥ |
| తేది. 18 | మంగళ | తదియ | ఉ॥గం.08.53వ॥ |
| తేది. 19 | బుధ | చతుర్థి | ఉ॥గం.09.11వ॥ |
| తేది. 20 | గురు | పంచమి | ఉ॥గం.09.06వ॥ |

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఈ వారం ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి నిర్వహణలో నిలబడగలరు మరియు వ్యాపకం బాగుంటుంది. పరిశ్రమల యజమానులకు, వ్యవసాయదారులకు పని వాళ్లతో సమస్యలుంటాయి. అనుకున్న పనులకు ఆటంకాలు కలుగుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, అధికారుల వత్తిడి పెరుగుతుంది. అధికారులకు స్థాన మార్పులుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులను దాటుకొని ఆదాయం పెంచుకొంటారు. ఆడిట్ అకౌంట్స్ రంగాల వారికి పనిఒత్తిడి బాగుంటుంది. అనుకున్న పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. సామాజిక కార్యక్రమాలు, దైవ కార్యక్రమాలలో ప్రముఖ బాధ్యత వహిస్తారు. ఖర్చులు పెరిగినా ఆర్థికంగా ఇబ్బందులుండవు. అధికారులకు స్థానచలనం ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

క్రొత్త పెట్టుబడులు, స్థిరాస్తుల లావాదేవీలపై నిర్ణయం తీసుకొంటారు. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం, ఆర్థికావశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. చేపట్టిన పనులకు అనుకూలత పరిస్థితులుండి నెరవేర్చుకొంటారు. సమావేశాలలో ఇంటా, బయట మీ మాటలను మన్నిస్తారు. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారులకు స్థాన మార్పులుంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, అనుభవం ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది. అయినా ఏదో విధంగా ఖర్చులు పెరుగుతాయి. ఇతరులపై ఆధారపడకుండా సొంత నిర్ణయాలు చేయండి. ప్రభుత్వ అనుమతులు వాయిదా పడవచ్చును. ఆహ్వానాలుంటాయి. ఉద్యోగులు అధికారులతో జాగ్రత్తగా మెలగండి. ఉద్యోగ ప్రయత్నాలలో చిన్న అవకాశాలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ముఖ్య సంప్రదింపులు, ఒప్పందాలలో అనుకూలత ఉంటుంది. వ్యాపారవృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తారు. వ్యాపార పోటీ తట్టుకొని ఆదాయం పెంచుకుంటారు. అవసరాలకు డబ్బును అందుకొంటారు. వృత్తి నిర్వహణలో ఇబ్బందులుండినా అధిగమిస్తారు. అదనపు ఖర్చులు అధికంగా ఉంటాయి. మీ మాటతీరు వల్ల కుటుంబ సభ్యులతో సమస్యలు వస్తాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు ముందు వెనుక జరుగుతుందోళన కలిగిస్తాయి. వ్యాపార వర్గాలకు శ్రమకు తగ్గ ఆదాయం ఉండదు. వృత్తి జీవనం కలవారికి అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగులకు పనిభారం, ప్రభుత్వ ఒత్తిడులుంటాయి. ఖర్చులు ఆదాయానికి తగ్గట్లుగానే ఉంటాయి. ఋణ పరిష్కారాలు చేసుకొంటారు. కోర్టు కేసులు వాయిదా పడగలవు. స్థిరాస్తుల లావాదేవీలు జరుగును. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికలావాదేవీలందు జాగ్రత్త అవసరం, కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. వృత్తి వ్యాపారాలలో పోటీ తట్టుకొని ఆదాయం పెంచుకొంటారు. ఆకస్మిక ప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. రావలసిన బాకీలు కొంత వసూలుకాగలవు. స్థిరాస్తులను ఏర్పరచుకొనే ప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు.

## మీనం




పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఈ వారం ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ప్రాబల్యం, మంచి అవకాశాలుండి, ఆదాయమార్గములను పెంచుకొనే ప్రయత్నం చేస్తారు. ఉద్యోగ వ్యాపార వర్గాలపై అధికారుల దాడులుండగలవు. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యంకాగలదు. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలలో తొందర పడవద్దు.

# కిరణశ్రీకి అంతర్జాతీయ అవార్డు

ప్రముఖ సాహితీవేత్త, ప్రభుత్వ పాఠ్యగ్రంథ రచయిత, విద్వాన్ కిరణశ్రీ అంతర్జాతీయ అవార్డుకు ఎంపికయ్యారని నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎ.జయప్రకాష్ తెలిపారు. 8వ తేదీ నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఇండియన్ సొసైటీ ఫర్ ఇండస్ట్రీ, ఇంటి లెక్చువల్ డెవలప్‌మెంట్ (న్యూఢిల్లీ) థాయ్‌లాండ్, మలేషియా, తెలుగు సంఘం సంయుక్తంగా ప్రతి ఏడాది అందజేస్తున్న గ్లోబల్ అచీవర్స్ అవార్డుకు ఈ సంవత్సరం విద్వాన్ కిరణశ్రీని ఎంపికజేసారని తెలిపారు. ఈనెల 15వతేదీన బ్యాంకాక్‌లో ప్రశంసాపత్రం, వెండి జ్ఞాపిక నగదు బహుమతి అందజేస్తారన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ విధానం మార్గసందర్శకాల మేరకు జాతీయ విపత్తు నిర్వహణకు సంబంధించి ఆంగ్లంలో ముద్రించిన 66జాతీయ విపత్తు నిర్వహణ గ్రంథాలను విద్వాన్ కిరణశ్రీ తన విశిష్ట పరిజ్ఞానంతో తెలుగులోకి అనువదించి తన ప్రత్యేకతను చాటుకుని గ్లోబల్ అచీవర్స్ అవార్డు పురస్కారానికి అర్హత పొందారని తెలిపారు.

# అయ్యప్ప విగ్రహప్రతిష్ఠాపన వార్షికోత్సవం



నెల్లూరు నగరం వేదాయపాలెంలో వేంచేసియున్న స్వామి అయ్యప్ప దేవస్థానంలో స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 28ఏళ్ళయిన సందర్భంగా స్వామి వారికి పవిత్ర జలాలతో నవభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం కేరళకు చెందిన నారాయణ నంబూద్రి, అజిత్ నంబూద్రిల పర్యవేక్షణలో విశేషపూజలు, గణపతి హోమం, ఉషఃపూజ, కలశస్థాపన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భూతబలి కార్యక్రమం అనంతరం శబరి మలవాసుని శ్రీవేలి ఉత్సవం కనులపండువగా జరిగింది. భక్తులకు అన్న సంతర్పణ గావించారు. ఉభయకర్తలుగా మల్లిఖార్జునరెడ్డి, చంద్రప్రభ దంపతులు వ్యవహరించారు. స్వామి అయ్యప్ప సేవా సమాజ అధ్యక్షుడు పిటి రంగరాజన్, కార్యదర్శి శేషగిరిరావు, సభ్యులు పాదర్తి బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా లక్ష్మీతులసిపూజ:**

భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రాంగణంలోని గురువాయురప్పన్ దేవస్థానంలో సోమవారం ఉదయం లక్ష్మీతులసిపూజను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

### రామలింగేశ్వరస్వామి సేవలో

# మంత్రి ఏరాసు



రాష్ట్ర న్యాయంశాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ఆదివారం నెల్లూరుజిల్లా రామతీర్థం గ్రామంలో వెలసియున్న శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతను గురించి మంత్రికి వివరించారు. మంత్రితో పాటు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, తహశీల్దార్ రమణయ్యలు పాల్గొన్నారు.


# బిజేపీ పగటి కలలుకంటోంది

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు మధు



నరేంద్రమోడీ ప్రధాని అవుతారని బిజేపీ పగటి కలలుకంటోందని సిపిఎం కేంద్ర కమిటి సభ్యుడు పి.మధు విమర్శించారు. ఆదివారం నెల్లూరు బాలాజీనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం కల్ల అని, కర్ణాటకతో సహా దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి ఓట్లు, సీట్లు వచ్చే ప్రసక్తేలేదన్నారు. మోడీ సీయం అభ్యర్థి అనగానే బీహార్‌లో నితీష్‌కుమార్, ఒరిస్సాలో నవీన్‌పట్నాయక్ బీజేపీకి దూరమయ్యారన్నారు. కాంగ్రెస్ అవినీతి, కుంభకోణాల్లో కూరుకుపోయిందని, ధరలు ఆకాశాన్నంటిన నేపథ్యంలో ప్రత్యామ్నాయం లేకనే మూడు రాష్ట్రాల్లో బిజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. నెల్లూరు అసెంబ్లీ స్థానం నుంచి ఈసారి సిపిఎం అభ్యర్థి పోటీ చేస్తారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు మోహన్ రావు, కత్తి శ్రీనివాసులు, మురళీకృష్ణ, అరిగెల రమమ్మ, మస్తాన్‌బీ, షాహీనాబీ, విజయమ్మ కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యాన్సర్ రోగులకు పండ్లు పంపిణీ



నెల్లూరు పొదలకూరురోడ్డులో ఉన్న క్యాన్సర్ హాస్పిటల్‌లో ఇటీవల ముస్లిం యూత్ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త మనుమడు అబ్దుల్ ఖాదర్ జిలాని జన్మించిన మాసాన్ని పురస్కరించుకొని రోగులకు పండ్లు, బ్రెడ్‌లు, ఫలహారాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ముస్లిం యూత్ నాయకులు ఖలీద్ మాట్లాడుతూ ప్రవక్త మహ్మద్ చెప్పిన మాటలను అనుసరిస్తూ అబ్దుల్ ఖాదర్‌జిలానీ సేవా కార్యక్రమాలను చేసేవాడని, రోగులను పరామర్శించడం, రోగులకు సహాయం చేయడం చేసేవాడని పేర్కొన్నారు. యువత చెడుదారిపడుతున్నారని, అలా కాకుండా వారికి ప్రేరణ కలిగించేలా ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కె.జి.ఎన్.ఫ్రూట్స్ మున్నా, జె.ఎస్.పి.మస్రూఖ్, ఇసాక్, అల్తాఫ్, డిబ్బు, ఆబిద్, సాదిక్, షఫి, ముజీర్ పాల్గొన్నారు.

# బీజేపీ ధ్యేయం

(7వ పేజీ తరువాయి)

పట్టించుకోలేదు. ఓ ప్రాంతానికి తీరని అన్యాయం చేసే ఇలాంటి బిల్లుకు ఎలా మద్దతు తెలపాలని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి తన పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నా చేస్తారు. ఎంపీలే పార్లమెంట్‌లో గొడవ చేస్తారు. టీ-బిల్లుపై సొంత పార్టీలోనే సంపూర్ణ మద్దతు సాధించలేని కాంగ్రెస్‌కు తమను వేలెత్తి చూపే అర్హత లేదని వెంకయ్య విమర్శించారు.

# కళ్యాణ వైభవం...!




కె.బి.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కావేరి బాలచంద్రారెడ్డి - విజయలక్ష్మిల కుమార్తె **డా॥ దీప - డా॥ సుమన్‌కృష్ణారెడ్డి** (నెల్లూరుజిల్లా కొమ్మలపూడి గ్రామ వాస్తవ్యులు తూపిలి మధుసూదన్‌రెడ్డి - శశికళ ల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 9వ తేదీ నెల్లూరు గుడిగంట్ల బాలపీరయ్య కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



నెల్లూరు వాస్తవ్యులు కలికి రామ్మోహన్‌రెడ్డి - హైమావతిల కుమార్తె **మనుదీప్తి - రోహిత్** (బెజవాడ జగదీష్ - సుప్రియల కుమారుడు )ల వివాహం ఈ నెల 9వ తేదీ నెల్లూరు వి.పి.ఆర్ కన్వెషన్ సెంటర్ నందు ఘనంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాశీస్సులు.



హైదరాబాద్ వాస్తవ్యులు అళహరి సత్యనారాయణ మనుమరాలు(ప్రముఖ సైంటిస్ట్ డా॥ జగదీష్ మేనకోడలు) **డా॥ శ్వేత - డా॥ రామసుబ్బారెడ్డి** (చల్లా నాగిరెడ్డి - వెంకటరత్నమ్మల కుమారుడు)ల పరిణయం ఈ నెల 9వ తేదీ హైదరాబాద్‌లోని ది సింఫోనిలో వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.



హైదరాబాద్ వాస్తవ్యులు సుదర్శన్‌రెడ్డి - విజయల కుమారుడు(ప్రముఖ న్యాయవాది గునపాటి ఆదిశేషారెడ్డి మనుమడు) **సంతోష్ - సింధూర** (లక్కప్రేమ్‌చంద్రారెడ్డి - సుజాతల కుమార్తె)ల పెళ్లి ఈ నెల 5వ తేదీ హైదరాబాద్‌లోని ఎస్.ఎస్.కన్వెన్షన్ సెంటర్ నందు వైభవంగా జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## గూడూరు డివిజన్ వార్తలు

# వృద్ధులకు ఫలసరుకుల పంపిణీ



ఫలసరుకులు పంపిణీ చేస్తున్న పద్మనాభరెడ్డి

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవనంలో 70మంది వృద్ధులకు సోమవారం సాయంత్రం రోటరీ హెల్పేజ్ పథకం కింద జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మెన్ పద్మనాభరెడ్డి దాతృత్వంతో వృద్ధులకు ఫలసరుకులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దాత అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రారంభించిన ఈ పథకం నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు ఎంతగానో చేయూతనిస్తోందన్నారు. కార్యక్రమానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. రోటరీక్లబ్ దశరథరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, కె.మునిగిరిష్, రామకృష్ణారెడ్డి, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి, కె.ఎస్.రెడ్డి, జేడిరెడ్డి వేణురెడ్డి, పీవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఇళ్లస్థలాలివ్వాలి

గూడూరు పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారు చాలా మంది అద్దె ఇళ్లలో ఉంటున్నారని, వారికి ఇళ్లస్థలాలు మంజూరు చేసి ఇంటిని నిర్మించాలని రాష్ట్ర వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు కటికాల వెంకటేశ్వర్లు మరియు టౌన్ అధ్యక్షులు వి.వి.రమణయ్యలు పురపాలక సంఘ ప్రత్యేకాధికారి ఆర్డీవోకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. కాగా అర్హులైన నిరుపేదలను వృద్ధులను గుర్తించి ఫించన్లు మంజూరుచేయాలని బాధితులు ఆర్డీవో మధుసూదన్‌రావుకు మొరపెట్టుకున్నారు. పలుమార్లు వినతులు ఇచ్చినా అవి బుట్టదాఖలా అవుతున్నాయని వాపోయారు. ఇంకా పలు సమస్యలపై ప్రజల వద్ద నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమీషనర్ జి.సుశీలమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

### అసహాయులకు పరికరాల పంపిణీకి

# 15లోగా ధరఖాస్తులు అందజేయాలి



మాట్లాడుతున్న బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి

జిల్లా వ్యాప్తంగా ఉన్న అసహాయులకు అవసరమైన పరికరాలను రోటరీక్లబ్ వైజేపీ లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన ఓఎన్‌జేసీ, ఏఎల్‌ఎంసీవో సహకారంతో పంపిణీ చేసేందుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు క్లబ్ ప్రతినిధులు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, యల్లంటి వేణురెడ్డిలు తెలిపారు. గూడూరు పట్టణంలోని మఠంవీధిలో ఉన్న రోటరీ భవనంలో సోమవారం వారు మాట్లాడుతూ అసహాయులకు అవసరమైన చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు తదితరాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పరికరాలు కావాల్సినవారు ఈనెల15న డీఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. దరఖాస్తులతో పాటు అంగవైకల్యం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాసుపోర్టు సైజ్ ఫోటో, రేషన్‌కార్డులను జతచేయాలని తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు దశరథరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, కె.మునిగిరీష్, రవీంద్రరెడ్డి, దయాకరరెడ్డి, ఎంపీసీ ఛైర్మెన్ రామరాఘవరెడ్డి పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికులకు ఆర్థికసాయం

## ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు

చెట్టుపై నుంచి పడి మృత్యువాత పడిన కల్లుగీత కార్మికుల కుటుంబాలకు, శాశ్వత వైకల్యం పొందిన వారికి సోమవారంనాడు ఎక్సైజ్ అధికారులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. గూడూరు జానకీరాంపేటలోని కార్యాలయంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు బాధిత 15కుటుంబాలకు 11.50లక్షల మేర చెక్కులను పంపిణీచేశారు. మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు 2లక్షల చొప్పున, అంగవైకల్యం పొందిన వారికి 50వేల వంతున భీమా నష్ట పరిహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ రత్నం, గౌడ్ సంఘం నాయకులు వెంకటరమణయ్య, ధనుంజయగౌడ్, జానా శ్రీనివాసులు, అంకయ్య, నాగభూషణం, పద్మయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి

రాష్ట్ర విభజన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏపీఎన్జీవోలు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం గూడూరు పట్టణంలో ఆ సంఘ నాయకులు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించారు. తొలుత తపాలా కార్యాలయంలోకి వెళ్లి సిబ్బందిని బయటకు పంపేశారు. దీంతో కార్యాలయం మూతపడింది. అనంతరం బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం బయట సమైక్య నినాదాలు చేస్తూ ఆందోళన వ్యక్తంచేశారు. అందరూ సమిష్టిగా పోరాడితేనే సమైక్య రాష్ట్రం సాధ్యమవుతుందని సంఘ నాయకులు మస్తానయ్య, శివకుమార్, ఓబులేసులు తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై రెండు రోజులు సమ్మె చేపడుతుండడంతో అవి కూడా మూతపడి కార్యాలయంలోకి వెళ్ళి సిబ్బందిని బయటకు పంపేశారు.

దీంతో కార్యాలయం మూతపడింది. పట్టణంలో సమైక్యాంధ్ర కోసం నినాదాలు చేస్తూ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఎల్.ఐ.సి కార్యాలయాన్ని కూడా మూయించి వేశారు.



ఇటీవల సమైక్యశంఖారావం యాత్రలో భాగంగా గూడూరుకు వచ్చిన వైయస్సార్సీపీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలుపుతున్న యల్లసిరి రాజీవ్‌రెడ్డి



# ఆనం జయ హైవే దిగ్బంధం

సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా ఈ నెల 12న ఆనం జయకుమార్‌రెడ్డి హైవే దిగ్బంధం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ సీమాంధ్ర ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా కేంద్రం సంప్రదాయాలను, నిబంధనలను తుంగలో తొక్కి బిల్లును పార్ల మెంటులో ప్రవేశ పెట్టాలనుకోవడం దారుణమని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రపతి కార్యాలయాన్నే తప్పుదారి పట్టించి బిల్లును నేరుగా రాజ్యసభలో పెట్టే ప్రయత్నం చేసిందన్నారు. రాజ్యసభ ఛైర్మెన్ జోక్యంతో తప్పుల తడకగా వున్న బిల్లును సవరించమని తిరిగి రాష్ట్రపతికి పంపించడంతో దానిని ఇప్పుడు లోక్‌సభలో ప్రవేశపెడుతున్నారన్నారు. బలవంతంగానైనా బిల్లు పాస్ చేసే ప్రయత్నాన్ని కేంద్ర మంత్రులు, ఎంపీలు మూకుమ్మడిగా వ్యతిరేకించాలన్నారు. విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఎన్జీఓలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. హైవే దిగ్బంధం చేస్తున్న ఆనం జయకుమార్‌రెడ్డిని, అనుచరులు ఆనంద్ సుధాకర్, వెంకటేశ్వర్లుయాదవ్, ఉజ్వల్, ఆర్ఎస్ఆర్, కోర్లగుంట బాబుఖాన్, ఏసునాయుడు, గార్లపాటి విజయనాగేశ్వరరావు, యానాదిరెడ్డి, కోటిరెడ్డి, కోటి తదితరులను పోలీసులు అరెస్ట్ చేసారు.

# సీమాంధ్రులు సింహాలై...

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రమంత్రులు, ఎంపీలు చేసిన గొడవతో రైల్వే మంత్రి 10నిముషాల్లోనే బడ్జెట్ ప్రసంగాన్ని ముగించాల్సి వచ్చింది. సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీలలో ఒక్కసారిగా వచ్చిన ఐక్యతను చూసి అప్రమత్తమైన కాంగ్రెస్ అధిష్టానం పక్కరోజు లోక్‌సభలో బిల్లు పెట్టడానికి మాఫియాడాన్‌ల కంటే ఎక్కువ వ్యూహ రచన చేసింది. హోంమంత్రి షిండే బిల్లును ప్రవేశపెట్టే సమయంలో ఆయన చుట్టూ వలయంలా ఏర్పడేందుకు కొంతమంది ఎంపీలను, అలాగే స్పీకర్ వద్ద నుండి బిల్లు ప్రతులను లాక్కోకుండా ఉండేందుకు మరి కొంతమంది ఎంపీలను కేటాయించింది. సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీలు కూడా ముందురోజే పార్టీల కతీతంగా సమావేశమై బిల్లును ఏ విధంగా అడ్డుకోవాలనేదానిపై ప్రణాళిక వేసుకున్నారు. 13వ తేదీ 11గంటలకు సభ మొదలయ్యాక 12గంటలకు వాయిదాపడింది. తిరిగి 12గంటలకు సభ మొదలవగానే టీ-బిల్లును అజెండాలో ప్రకటించకుండానే, ఇతర పార్టీలకు తెలియజేయకుండానే ప్రవేశపెట్టినట్లుగా స్పీకర్ ప్రకటించారు. ఈ సమయంలో సీమాంధ్ర ఎంపీలు వెల్‌లోకి దూసుకుపోగా అక్కడ గుంపుగా వున్న తెలంగాణ ఎంపీలు, ఇతర రాష్ట్రాల కాంగ్రెస్ ఎంపీలు వారిపై దాడికి దిగారు. కొంత మంది ఎంపీలు వేణుగోపాలరెడ్డిని కొడుతుండగా, లగడపాటి రాజగోపాల్ ఆయనను కాపాడే ప్రయత్నం చేసారు. లగడపాటి మీద కసితో ఎప్పటి నుండో కాసుకునివున్న తెలంగాణ ఎంపీలు పొన్నం ప్రభాకర్, మరో ఇద్దరు ఆయనను కిందపడేసి కొడుతుండగా, ఆత్మరక్షణ కోసం లగడపాటి తన వద్దవున్న పెప్పర్ స్ప్రేను స్ప్రే చేసారు. దీంతో ఘాటు వాసన రావడంతో ఇతర రాష్ట్రాల ఎంపీలు బయటకు పరుగులుతీసారు. ఈ స్ప్రేతో లగడపాటితో పాటు పొన్నం ప్రభాకర్, మరో ఇద్దరు ఎంపీలు అస్వస్థతకు గురికాగా వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. టీ-బిల్లును నిరసిస్తూ సభలోనే టీడీపీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి ఆత్మహత్యాయత్నం చేయగా మిగిలిన సభ్యులు నివారించారు. జరిగిన సంఘటనలతో కలతచెందిన మరో ఎంపీ కొనకళ్ల నారాయణ గుండె పోటుకు గురయ్యారు.

లోక్‌సభలో యుద్ధకాండ నెలకొంది. సీమాంధ్ర ప్రజల భావోద్వేగాలు ఏ స్థాయిలో వున్నాయో సభలో సీమాంధ్ర ఎంపీలు ప్రతిబింబించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వమే ఓట్లు, సీట్ల కోసం అడ్డదారి పట్టినప్పుడు సీమాంధ్రులు చేసిన పనిని తప్పుపట్టే అర్హత ఎవరికీ లేదు. రాష్ట్రాన్ని చీల్చండి... కానీ సీమాంధ్రకు న్యాయం చేయండి మొర్రో అంటుంటే జీఓఎం సభ్యుల నుండి రాష్ట్రపతి వరకు ఎవరూ చెవికెక్కించుకోవడం లేదు. చివరకు ఇంత అన్యాయమైన బిల్లును తన జీవితంలో చూడలేదన్న అద్వానీ బృందం సైతం ఈ బిల్లుకు షరతులతో కూడిన మద్దతు ఇవ్వడానికి సిద్ధమైంది. మరి సీమాంధ్రకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలంటే ఎంపీలు తెగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితిని కేంద్రమే కల్పించింది.

సీమాంధ్ర ఎంపీల తెగింపుతోనే కాంగ్రెస్ బండారం బయటపడింది. కాంగ్రెస్ ఓటు రాజకీయాల వల్లే భారత పార్లమెంట్ చరిత్రలో ఒక చీకటిరోజును చూడాల్సి వచ్చిందని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోసాయి. కాంగ్రెస్ ఓట్ల కక్కుర్తి అన్ని పార్టీలకు అర్థమైపోయింది. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల మధ్య వివాదాస్పద బిల్లులు పెట్టడం సాధ్యంకాదని, బడ్జెట్ ఒక్కటే పెడితే చాలని అద్వానీ పేర్కొనడం జరిగింది. బీజేపీతో సహా విపక్షాలు టీ-బిల్లును ప్రవేశపెట్టినట్లు చూపొద్దని స్పీకర్‌ను కోరాయి. గురువారం నాటి సంఘటనల నేపథ్యంలో సీమాంధ్రకు చెందిన 14మంది ఎంపీలను తెలంగాణ నుండి ఇద్దరు ఎంపీలను సమావేశాలు ముగిసేదాకా సస్పెండ్ చేసారు. అంటే సీమాంధ్రుల పీక పిసికి బిల్లును నెగ్గించుకోవడానికి కాంగ్రెస్ వేసిన ఎత్తుగడ ఇది. ఇక లోక్‌సభలో సీమాంధ్ర కేంద్రమంత్రులు మాత్రమే మిగిలారు. వీరిలో చింతా మోహన్, పనబాక లక్ష్మి, కిషోర్ చంద్రదేవ్‌లు అధిష్టానానికి లోబడిపోయారు. సభ 17వ తేదీకి వాయిదా పడింది. 17వతేదీ ఓటాన్ అకౌంట్ ఉంది. ఆ తర్వాత మళ్ళీ టీ-బిల్లుపై చర్చ జరిగే అవకాశముంది. సీమాంధ్ర ఎంపీలు మిగిల్చిన బాధ్యతను కేంద్రమంత్రులు పూర్తిచేసి, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సివుంది.

# నమస్కారం

(మొదటిపేజీ తరువాయి)

కిరణ్‌కుమార్‌రెడ్డి పార్టీ పెడితే అందులో చేరే అవకాశాలు కూడా లేకపోలేదు. ఆదాలకు గాని ముంగమూరుకు గాని కాంగ్రెస్‌తో తక్కువకాలం బంధమే. ఇద్దరూ తెలుగుదేశంపార్టీ నుండే వచ్చారు. ఆదాల 2004లో కాంగ్రెస్‌లోకి వచ్చాడు. 2004, 2009లలో సర్వేపల్లి నుండి ఎమ్మెల్యేగా గెలిచాడు. ముంగమూరు ఇంతవరకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎక్కడా పోటీ చేయలేదు. 2009లో తెలుగుదేశం నుండి ప్రజారాజ్యంలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా నెల్లూరు నగరం నుండి పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో ముంగమూరు కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేగానే ముద్రపడ్డారు. ఈ ఐదేళ్లు ఆనం సోదరులతో స్నేహాన్ని కొనసాగించి అభివృద్ధి పనులు బాగానే చేసుకున్నారు. విభజన బిల్లు నేపథ్యంలో కాంగ్రెస్ నుండి బయటకు రావాలని నిర్ణయించుకున్నారు. ఆదాల, ముంగమూరుల నిర్ణయాలతో సర్వేపల్లి, నెల్లూరు నగరంలలో కాంగ్రెస్‌కు భారీ నష్టమే!

# పోలీస్ కింగ్

(మొదటిపేజీ తరువాయి)

సిఐడి డిఐజిగా బదిలీ చేసారు. 2013జూలై 2న రామకృష్ణ జిల్లా ఎస్పీగా వచ్చారు. ఆయన రాకముందు జిల్లాలో పోలీసు వ్యవస్థ గాడితప్పింది. ప్రతిరోజూ నేరాలుండేవి. పోలీసుశాఖపై అప్పటి ఎస్పీ రమణకుమార్‌కు నియంత్రణ లేకపోవడంతో నేరగాళ్లు రెచ్చిపోయారు. రామకృష్ణ వచ్చాక నేరాలను చాలావరకు కంట్రోల్ చేయడమేకాక పోలీసుశాఖను పనిలో పెట్టి ఫలితాలు రాబట్టారు. జనవరి 27న డిఐజిగా ఆయనకు పదోన్నతి వచ్చింది. దీంతో బదిలీ తప్పలేదు.

# కళ్యాణ వైభవం...!



ముదివర్తి వాస్తవ్యులు లేబూరు వెంకటశేషారెడ్డి - శార్వాణిల కుమార్తె **వెంకట శరణ్య - రాము** (విడవలూరు వాస్తవ్యులు అడపాల సురేంద్రరెడ్డి - రజితల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 9వ తేదీ నెల్లూరు చెముడుగుంటలోని స్రీడ్స్ ఫంక్షన్‌హాలులో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



తంజావూరు చిత్రకళాకారులు స్వర్గీయ ఆరంబాకం రాజసింహ మనుమరాలు, స్వర్గీయ ఆరంబాకం రవికుమార్ - ఉషారాణిల కుమార్తె **ముకుందప్రియ - మదన్‌కుమార్** (ఆత్మకూరు వాస్తవ్యులు పి.సుబ్బారెడ్డి - శైలజల కుమారుడు)ల వివాహం ఈ నెల 9వ తేదీ నెల్లూరులోని సింహపురి గార్డెన్స్ నందు జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

# అసాధ్యుడు సుబ్బరామిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిరోజూ ఆయనలో కొత్త సుబ్బరామిరెడ్డే కనిపిస్తాడు. చేసిందానికంటే చేయాల్సింది ఇంకా ఎంతో వుందన్న సుబ్బరామిరెడ్డే దర్శనమిస్తాడు. వ్యక్తి కాదు ఓ అద్భుతశక్తి ఆయన. రాజకీయ, సామాజిక, సేవా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలలో ఎనలేని అనుబంధాన్ని పెనవేసుకున్న సేవామూర్తి టీఎస్సార్. నిఖార్సయిన కాంగ్రెస్‌వాది. కాని అన్ని పార్టీల వారికి ఆయన అజాతశత్రువు. స్నేహానికి నిలువెత్తు చిరునామా ఆయన. చిన్నతనంలో జగదేవిపేటలో గోళీకాయలు ఆడిన తోటి స్నేహితులతో ఆరోజు ఎలా ఉన్నాడో ఈరోజూ అలానే ఉన్నాడు. యూపిఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌లను అపాయింట్‌మెంట్ లేకుండా నేరుగా వెళ్లి కలిసే చనువు. వారి విమానాలలో పక్కనే కూర్చుని ప్రయాణించగల పరపతి వున్నా, తన ఊరును, తన చిన్ననాటి జ్ఞాపకాలను ఆయన వదల్లేదు. ఎదిగేకొద్ది ఒదుగుతూ, వినయంతోనే ఎదుగుతూ ఈరోజు కాంగ్రెస్ పార్టీలోనే ఓ గొప్ప స్థానాన్ని సంపాదించుకున్నాడు మన సుబ్బరామయ్య.

ఆయనకు ఒక కన్ను నెల్లూరైతే రెండో కన్ను విశాఖ. ఈ నగర ప్రజలతో ఆయన అనుబంధం 4దశాబ్దాల నాటిది. కన్నతల్లిని ఎంతగా ప్రేమిస్తాడో, తనను ఆదరించిన విశాఖపట్నంను కూడా అంతే అభిమానిస్తాడు. విశాఖ ప్రజల కోసం ఆయన చేపట్టని సేవాకార్యక్రమమంటూ లేదు. టీఎస్సార్ కళాపీఠం ద్వారా ప్రతిఏటా ఎంతో మంది వృద్ధ, పేద కళాకారులను ఆదుకుంటున్నారు. తన జన్మదినోత్సవం నాడు వివిధ భాషల కళారంగాలను విశాఖకే తీసుకువస్తున్నారు. కళారంగానికి విశిష్ట సేవలందించిన కళాకారులను విశాఖ ప్రజల తరపున సత్కరిస్తూ విశాఖ గౌరవాన్ని ఇనుమడింపజేస్తున్నారు. విశాఖ కేంద్రంగా చెట్లు పెంచడం, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం, పేదల గృహనిర్మాణానికి ఆర్థికసాయం, ఆలయాలు, మసీదులు, చర్చీల జీర్ణోద్ధరణకు విరాళాలు, క్రీడలను అభివృద్ధి చేయడానికి సినీతారలతో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం, క్రీడల పట్ల యువతను ప్రోత్సహించడానికి వందకు పైగా యూత్‌క్లబ్‌ల ఏర్పాటు, 450కోట్లతో విశాఖలో 100పడకల క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం... ఇవన్నీ ఆయన సేవా భారతంలో కొన్ని అధ్యాయాలు మాత్రమే. ఆయన జీవితమనే గ్రంథంలో ఇలాంటివి చదువుకుంటూ పోతే కోకొల్లలుగా ఉంటాయి.

ఇలాంటి సేవాతపస్వి నెల్లూరులో పుట్టడం, నెల్లూరు ఖ్యాతిని దశదిశలా చాటటం ఆనందదాయకమే. అయితే ఈమధ్య జరిగిన నెల్లూరు లోక్‌సభ ఉపఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఆయనను ఓడించి పంపడం తీరని లోటుగా మారింది. ఆ ఎన్నికలలో టీఎస్సార్ స్థానంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వచ్చి పోటీచేస్తున్నా ఓటమి తప్పేదికాదు. ఎందుకంటే ఆనాడున్న జగన్ గాలి అలాంటిది. తన జన్మభూమి నెల్లూరుకు ఎంతో సేవచేయాలని వచ్చిన ఆయనను ఆ ఓటమి నిరుత్సాహ పరచింది. ఆరోజు నెల్లూరు ప్రజలు వై.యస్. పట్ల వున్న అభిమానంతో వైకాపాకు ఓట్లేసారేగాని టీఎస్సార్ అంటే అభిమానం లేక కాదు. దీనిని మనసులో పెట్టుకోకుండా ఆయన నెల్లూరుతో తన అనుబంధాన్ని పెంచుకోవాలని కోరుతూ, ముచ్చటగా మూడోసారి రాజ్యసభలో అడుగుపెట్టిన మా నెల్లూరు సుబ్బరాముడికి అభినందనలు తెలుపుతున్నారు ఆయన అభిమానులు.

సుబ్బరామిరెడ్డికి జన్మనిచ్చిన నెల్లూరుజిల్లా ఆయన సేవలను అందుకునే అదృష్టానికి నోచుకోలేదన్నది ఆయన శ్రేయోభిలాషుల ఆవేదన. గల్లీ నుండీ ఢిల్లీ దాకా తనదైన స్టయిల్లో ఆప్తులను, ఆత్మీయులను అభిమానులను సంపాదించుకుని నేడు వరుసగా మూడవసారి రాజ్యసభకు వెళ్లిన సుబ్బరామిరెడ్డి అసాధ్యుడే.



# సేవకు పట్టాభిషేకం

తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్‌గా
భక్తుల నీరాజనాలందుకున్న ఆధ్యాత్మికరాముడు

అటు బాలీవుడ్ ఇటు టాలీవుడ్‌లతో పాటు
కళారంగానికి ఆరాధ్యదైవమై ప్రకాశిస్తున్న కళాభిరాముడు

రెండుసార్లు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై నేడు ముచ్చటగా
మూడవసారి రాజ్యసభకు ఎంపికైన సేవాభిరాముడు

మంచితనం, మానవత్వం, సేవాగుణం
ఆధ్యాత్మికతత్వం, కళారాధన కలపోసిన సకలగుణాభిరాముడు

నెల్లూరీయుల ముద్దుబిడ్డగా తెలుగుజాతి ప్రతినిధిగా
దేశస్థాయిలో సంచలనాలకు నాందిగా నిలిచిన
సకలజనమనోభిరాముడు

**తిక్కవరపు సుబ్బరామిరెడ్డి గారికి**

మా శుభాకాంక్షలు.

**- దువ్వూరు శివకుమార్‌రెడ్డి**
నెల్లూరు.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.